కరీంనగర్ వార్త
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
శుక్రవారం 29, మే 2026 16 పేజీలు



# గ్రానైట్ ప్రకంపనలు






2లో

కరీంనగర్ టూ ఢిల్లీ... ఫిర్యాదుల పరంపర....

నిధుల మళ్లింపుపై దర్యాప్తు సంస్థల గురి...!

తార్కిక ముగింపు ఉండేనా...?

ప్రధాన ప్రతిపక్షాల చేతిలో పాశుపతాస్త్రం....?

దర్యాప్తు సంస్థలపైనే ఫిర్యాదులు.....!

కరీంనగర్ బ్యూరో, ప్రభాతవార్త: నిశ్శబ్ద కొండల్లో నల్లబంగారం మాఫియా ప్రకంపనలు సృష్టిస్తోంది... ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటేనే అంతర్జాతీయంగా పేరుగాంచిన టాన్ బ్రౌన్, మేపుల్ రెడ్ గ్రానైట్‌కు నిలయం. అయితే, గత కొన్నేళ్లుగా ఇక్కడి మైనింగ్ పరిశ్రమ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోందనే ఆరోపణలు లేక పోలేదు. రాయల్టీల ఎగవేత, అనుమతులకు మించి తవ్వకాలు,విదేశీ నిధుల మళ్లింపు ఆరోపణలపై గత కొంతకాలంగా కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం జాతీయ స్థాయిలో సంచలనంగా మారింది.

# గత ప్రభుత్వంతో పోలిస్తే యాసంగి ధాన్యం కొనుగోళ్లలో 25 నుంచి 35శాతం అధికం

ప్రభుత్వమే చివరి గింజ వరకూ మద్దతుపై కొనుగోలు చేస్తుంది

తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు

డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు

నెలాఖరులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలి మంత్రి ఉత్తమ్



2లో






















# గ్రానైట్ ప్రకంపనలు

## కరీంనగర్ టూ ఢిల్లీ... పిర్యాదుల పరంపర....
## నిధుల మళ్లింపుపై దర్యాప్తు సంస్థల గురి...!
## తార్కిక ముగింపు ఉండేనా...?
## ప్రధాన ప్రతిపక్షాల చేతిలో పాశుపతాస్త్రం....?
## దర్యాప్తు సంస్థలపైనే ఫిర్యాదులు.....!



**కరీంనగర్ బ్యూరో, ప్రభాతవార్త:** నిశ్శబ్ద కొండల్లో నల్ల బంగారం మాఫియా ప్రకంపనలు సృష్టిస్తోంది... ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటేనే అంతర్జాతీయంగా పేరుగాంచిన టాన్ బ్రౌన్, మేపుల్ రెడ్ గ్రానైట్‌కు నిలయం. అయితే, గత కొన్నేళ్లుగా ఇక్కడి మైనింగ్ పరిశ్రమ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోందనే ఆరోపణలు లేకపోలేదు. రాయల్టీల ఎగవేత, అనుమతులకు మించి తవ్వకాలు,విదేశీ నిధుల మళ్లింపు ఆరోపణలపై గత కొంతకాలంగా కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం జాతీయ స్థాయిలో సంచలనంగా మారింది.

### ఉల్లంఘనలపై గురి..?

కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్,ఆదాయపు పన్ను శాఖ కరీంనగర్ గ్రానైట్ వ్యాపారులపై ప్రధానంగా దృష్టి పెట్టాయి. చైనా, తైవాన్, దుబాయ్ వంటి దేశాలకు గ్రానైట్ ఎగుమతి చేసి, వచ్చిన ఆదాయాన్ని అధికారిక బ్యాంకింగ్ మార్గాల ద్వారా కాకుండా, హవాలా రూపంలో మళ్లించారనేది ప్రధాన ఆరోపణ.ఈ విషయం ఫెమా ఉల్లంఘనల కిందకు వస్తుంది.. కరీంనగర్‌లోని ప్రముఖ గ్రానైట్ ఏజెన్సీలు వాటి నిర్వాహకుల ఇళ్లపై ఈడీ గతంలో నిర్వహించిన సోదాల్లో కీలకమైన డైరీలు, నకిలీ ఇన్వాయిస్‌లు, డిజిటల్ సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నట్లు మీడియాకు వెల్లడించారు... అయినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోకుండా సదరు శాఖ అధికారులు ఎందుకు కాలయాపన చేస్తున్నారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి.. అక్రమ తవ్వకాలు, తరలింపు, పన్నుల ఎగవేతపై వచ్చిన అనధికారిక ఆదాయాన్ని వివిధ షెల్ కంపెనీల ద్వారా రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లోకి మళ్లించినట్లు ఐటీ శాఖ నివేదికలు పేర్కొంటున్నాయి.

### రాయల్టీ ఎగవేతపై కొరడా...!:

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ప్రకారం..ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్రమ గ్రానైట్, మైనింగ్ మాఫియాతో భారీ ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందనే ఆరోపణలు లేకపోలేదు. మైనింగ్ శాఖ నుంచి పొందిన పర్మిట్ల (ట్రాన్సిట్ పాస్ లు) కంటే విదేశాలకు ఎగుమతి చేసిన గ్రానైట్ పరిమాణం చాలా ఎక్కువగా ఉన్నట్లు విజిలెన్స్ గుర్తించింది. కాకినాడ, కృష్ణపట్నం, విశాఖపట్నం,చెన్నై ఓడరేవుల ద్వారా జరిగిన ఎగుమతుల డేటాను, మైనింగ్ రికార్డులతో సరిపోల్చినప్పుడు వందల కోట్ల రూపాయల తేడాలు బయటపడ్డాయనీ అధికారుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.. లీజు నిబంధనలను ఉల్లంఘించినందుకు, అక్రమ రవాణాకు పాల్పడినందుకు మైనింగ్ శాఖ గతంలో దాదాపు 8 కంటే ఎక్కువ జిల్లాలోని గ్రానైట్ కంపెనీలకు రూ. 749 కోట్ల వరకు పెనాల్టీలు (రాజధన ఎగవేత రుసుము) విధిస్తూ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే..ఈ వ్యవహారం ప్రస్తుతం న్యాయపరమైన వివాదాల్లో ఉన్నట్లు కొంతమంది వ్యాపారులు మార్కెట్లో చెపుతున్నట్లు సమాచారం..

### ఇంకా విచారణలే...!:

కరీంనగర్ గ్రానైట్ అక్రమాలపై కేవలం శాఖాపరమైన చర్యలే కాకుండా క్రిమినల్ విచారణ జరపాలని కోర్టుల్లో పిల్స్ దాఖలైనట్లు విశ్వసనీయ సమాచారం. కరీంనగర్ నుంచి కాకినాడ పోర్టుకు రైల్వే వ్యాగన్ల ద్వారా గ్రానైట్ తరలించే క్రమంలో బరువును తక్కువగా చూపించి, భారతీయ రైల్వేకు సైతం నష్టం చేకూర్చారనే ఆరోపణలపై సీబీఐ ప్రాథమిక విచారణ జరిపింది. హైకోర్టులో దాఖలైన పిటిషన్ల నేపథ్యంలో, దర్యాప్తు సంస్థలు వారి విచారణ ప్రగతి నివేదికలను సీల్డ్ కవర్లలో న్యాయస్థానానికి సమర్పించినట్లు సమాచారం..

### ప్రతిపక్షాల చేతిలో పాశుపతాస్త్రం...?

దేశంలో సంచలనం సృష్టించిన నేషనల్ హెరాల్డ్ కేసు,ఢిల్లీ లిక్కర్ స్కాం వంటి విషయాల్లో ప్రభుత్వం,దర్యాప్తు సంస్థలు ఎంత వేగంగా స్పందించి, అరెస్టులు,కఠిన చర్యలు తీసుకున్నాయి మరి ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.కరీంనగర్ గ్రానైట్ స్కాంలో ఎందుకు అంతటి వేగం చూపించడం లేదని ప్రధాన ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో గళమెత్తానున్నట్లు సమాచారం.వేల కోట్ల రూపాయల హవాలా, రాయల్టీ ఎగవేత, రైల్వే ఆదాయానికి గండి కొట్టిన ఇంతటి పెద్ద కుంభకోణంలో ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోందనే చర్చ జిల్లాలో కొనసాగుతుంది. ప్రతిపక్షాల కేసుల్లో చూపించే ఉత్సాహం ఇక్కడ ఎందుకు లోపించిందని పార్లమెంట్ వేదికగా ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది.ఈ అక్రమ గ్రానైట్,మైనింగ్ కుంభకోణంలో కొంతమంది కేంద్ర,రాష్ట్ర ప్రజాప్రతినిధులు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి... వారి అండదండలతోనే విచారణ ఇంకా కొనసాగుతుందనే విమర్శలు లేకపోలేదు... జీఎస్టీ ఎగవేత,నకిలీ ఇన్వాయిస్ లపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి,విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో సాక్షాత్తు ముఖ్యమంత్రి సైతం గ్రానైట్ అక్రమాలపై విచారణను సీబీసీఐడికి అప్పగిస్తామని ప్రకటించడం గమనార్హం.

### పర్యావరణ ఉల్లంఘనలు:

మైనింగ్ పరిమితులను మించి తవ్వకాలు జరపడంతో పర్యావరణానికి జరిగిన నష్టంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆరోపణలు లేకపోలేదు. పర్యావరణ అనుమతులు పొందిన పరిధిని దాటి కొండలను పిండి చేయడం, స్థానిక చెరువులు, సాగుభూములు కలుషితం కావడంపై ఎన్జీటీ ప్రత్యేక కమిటీలను నియమించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపించినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘించిన గ్రానైట్ క్వారీ, మైనింగ్ నిర్వాహకులపై పర్యావరణ నష్టపరిహారం కింద భారీ జరిమానాలు విధించాలని కమిటీలు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది..

### పిర్యాదుల పరంపర..చర్యలు ఉండేనా..?:

గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ గ్రానైట్,మైనింగ్ మాఫియా వ్యవహారంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదులు అందుతున్నట్లు తెలుస్తుంది.. ఇటీవలే డిఓపిటికి, పీఎంఓ కార్యాలయానికి కరీంనగర్ నుంచి ఫిర్యాదులు వెళ్లగా వాటిపై కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం..విచారణ సంస్థలు గత కొన్ని సంవత్సరాలుగా దర్యాప్తు జరుగుతుందని మాత్రమే చెప్తున్నారు, ఈ విషయాన్ని ఎప్పుడు మోక్షం లభిస్తుందో అనే చర్చ జిల్లాలో జోరుగా కొనసాగుతుంది.. ఎది ఏమైనా అక్రమ గ్రానైట్,మైనింగ్ మాఫియా వ్యవహారం అటు ప్రభుత్వ ఖజానాని కొల్లగొట్టడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని సైతం ఇబ్బందులకు గురిచేస్తుంది అనేటువంటి వాదనలు లేకపోలేదు..

### దర్యాప్తు సంస్థలపైనే ఫిర్యాదులు..!

ఈ గ్రానైట్ ఎపిసోడ్‌లో అత్యంత సంచలనమైన మలుపు చోటు చేసుకున్నట్లు సమాచారం. కేంద్ర,రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపైనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలక సాక్ష్యాలు దొరికినా, ఏళ్లు గడుస్తున్నా సదరు శాఖల అధికారులు నిందితులపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదంటూ నేరుగా ఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ), పీఎంఓ కార్యాలయాలకు కరీంనగర్ నుంచే ఫిర్యాదులు వెళ్లడం సంచలనం రేపుతోంది.వారు కూడా జిల్లాలో విచారణ జరిపినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. కానీ చర్యలు మాత్రం తీసుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గ్రానైట్ మైనింగ్ వ్యవహారం ప్రస్తుతం ఇటు దర్యాప్తు సంస్థల నివేదికలు,అటు న్యాయస్థానాల తీర్పుల మధ్య నలుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయం ఎగవేత జరిగిందని దర్యాప్తు సంస్థలు అంటుంటే.. తాము నిబంధనల మేరకే వ్యాపారం చేస్తున్నామని పారిశ్రామికవేత్తలు చెప్తున్నారు. విచారణ సంస్థలు ఏళ్ల తరబడి దర్యాప్తు సాగుతోందని చెప్పడమే తప్ప తార్కిక ముగింపు ఇవ్వడం లేదనే చర్చ నడుస్తోంది.మరి ఈ విషయానికి శుభం కార్డు పడుతుందా లేదా వేచి చూడాల్సిందే...

# మహిళా చట్టాలపై సదస్సు

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో మహిళా వారోత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 16మంది మహిళలను సన్మానించారు.ఈ సందర్భంగా గృహ హింస, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణా రెడ్డి,పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, సమానత్వ వేతన చట్టంలపై సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయ వాది హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్. దేశాయ్, సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం,సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, ఉపాధ్యక్షులు వి. ప్రకాష్, ఎం. డి. యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే. సత్యనారాయణ, మహిళా కార్యదర్శి బొబ్బాటి కరుణ ,కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, జగిత్యాల పట్టణ అధ్యక్షులు మానాల కిషన్, జగిత్యాల డివిజన్ అధ్యక్షులు బి. రాజేశ్వర్,ధర్మపురి అధ్యక్షులు కండ్లె గంగాధర్, కార్యదర్శి దుబ్బేశం, బాలయ్య, ప్రసాద్, నారాయణ,వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంతో పోలిస్తే యాసంగి ధాన్యం కొనుగోళ్లలో 25 నుంచి 35శాతం అధికం

## ప్రభుత్వమే చివరి గింజ వరకూ మద్దతుపై కొనుగోలు చేస్తుంది
## తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు
## డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు
## ఈ నెలాఖరులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
## ధాన్యం కొనుగోలుపై మంత్రి రివ్యూ

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లర్లకు ఏవైనా నష్టాలు వచ్చినా ప్రభుత్వం భరిస్తుందని, రైతులకు మాత్రం నష్టం జరగనివ్వమన్నారు. రైతుల చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.లి గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు. రాబోయే 4 నుంచి 5 రోజుల పాటు ఇసుక రవాణా నిలిపివేసి వాహనాలను పూర్తిగా ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా, ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. డిసెంబర్ 2023 తర్వాత కనీస మద్దతు ధర విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తూ రైతులకు ఇప్పటివరకు అదనంగా రూ.16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తడిసిందని, ఆ ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సార్లు ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ ఎక్కడా ఒక్క కిలో ధాన్యానికి కూడా తరుగు పేరుతో కోత విధించలేదన్నారు. ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూలి ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని, అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు రూ.788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 6.9 లక్షల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 5.7 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగంలో ఉన్నాయని, ఇంకా 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి అవసరమైన నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడారు. అంతకుముందు పెద్ద కలవల్ల ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, ఎమ్మెల్సీ భానుప్రసాద రావు, గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్స్ నూగిల్ల మల్లన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి, మినుపాల ప్రకాష్ రావు, రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని కాలిందిని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# కేరళ మాజీ సీఎం పినరై విజయన్ ఇళ్లపై ఈడీ సోదాలు రాజకీయ కక్షసాధింపు చర్యే

### సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్ తీవ్ర ఖండన

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు పినరై విజయన్ నివాసాలపై కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరిపిన అక్రమ సోదాలను నిరసిస్తూ గురువారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు ఈ డి కి, కేంద్ర బీజేపీ ప్రభుత్వనికి వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను బూచీగా చూపిస్తూ ప్రతిపక్షాలపై కక్షసాధింపుకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఈడీ, సీబీఐలను బీజేపీ తన సొంత విభాగాల్లా వాడుకుంటూ విపక్షాల గొంతు నొక్కుతోందన్నారు. కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రగతిశీల ప్రభుత్వ ప్రజాదరణను దెబ్బతీసేందుకే ఈ తప్పుడు సోదాలు




మోదీ ప్రభుత్వ నిరంకుశ, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఏకం కావాలనీ అన్నారు. నిఖార్సైన ప్రజా పక్షపాతిగా పేరున్న పినరై విజయన్‌పై ఇటువంటి బెదిరింపు రాజకీయాలు సాగవని కల్లేపల్లి అశోక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సీపెల్లి రవీందర్, జి జ్యోతి, మండల కమిటీ సభ్యులు జిల్లాల ప్రశాంత్, మోదుంపల్లి శ్రావణ్, ఎండి ఖాజా, నాయకులు జె నరేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు-దారుణాలు

## తాడిచెట్టుపై నుంచి జారి
# గీత కార్మికుడు మృతి

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**



మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు వీరగోని బక్కయ్య (45) తాడిచెట్టు ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో మృతి చెందాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. స్థానికుల కథనం మేరకు.. బక్కయ్య రోజువారీ పనిలో భాగంగా తాడిచెట్టు ఎక్కుతుండగా ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన ఆయనను స్థానికులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బక్కయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేణుగోపాల్ తెలిపారు. కాగా, బక్కయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాట్నపల్లి సర్పంచ్ ఒగుల పూజ, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పొన్నం పోచమల్లు కోరారు.

# వ్యవసాయ బావిలో పడి బాలుడు మృతి

**బుగ్గారం ప్రభాతవార్త:**

బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన ఒర్సు శ్రీనివాస్ తండ్రి నరసయ్య తన చిన్న కుమారుడు ఒర్సు శివకుమార్ వయస్సు 11 సంవత్సరాలు గొర్లు చూసుకోవ డానికి పరుమాల మహేష్ చిన్నాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో ఉంచి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్ళాడు అనంతరం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో పరిమల మహేష్ ఫోన్ చేసి బాలుడు కనబడడం లేదని తెలిపి, వెంటనే అక్కడికి రావాలని శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చినాడు. శ్రీనివాస్ అక్కడికి వెళ్లగా చిన్నాపూర్ గ్రామ శివారులోని అంతడుపుల రామ లింగయ్య వ్యవసాయ



బావిలో బాలుడి చెప్పులు కనిపించాయి. మృతుడి తండ్రి మహేష్ గ్రామస్థులు బావిలో వెతకగా ఒర్సు ప్రభాకర్ అను వ్యక్తి బాలుడిని బావిలో నుండి బయటకు తీశాడు పరుమాల మహేష్ తెలిపిన వివరాల ప్రకారం, బాలుడు బాత్రూం కి వెళ్తానని చెప్పి వెళ్లి, అనంతరం బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావి లో పడి నీటి లో మునిగి చనిపోయాడు అయితే తన కుమారుడి మరణంపై పరుమాల మహేష్ పై అనుమానం ఉన్నదని తెలపడం తో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి సతీష్ తెలిపారు.

# బర్లు కోసం వెళ్లి..
# పొలంలో శవంగా కనిపించిన రైతు

### వడదెబ్బతో మృతి చెందినట్లు అనుమానం
### గ్రామంలో విషాదం

**ఎన్టీపీసీ, ప్రభాతవార్త:**



ఇంటి సమీపంలోని బర్లు చూసేందుకు వెళ్లిన వ్యక్తి మరుసటి గురువారం ఉదయం పొలంలో మృతదేహంగా కనిపించిన ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అతను అప్పల రాజయ్య పొలాల వద్దకు వెళ్లాడు. అయితే రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పొలాల వద్దకు వెళ్లిన స్థానికులు ఒడ్డు ప్రక్కన అతను పడి ఉండటాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్ర ఎండలు, వడగాలుల కారణంగా వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టిపిసి ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి

**జూలపల్లి, ప్రభాతవార్త:**

జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన పంగ సాయికృష్ణ ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేలుకుంటకు చెందిన పంగ లక్ష్మిరాజంకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానంగా కలరు. చిన్న కొడుకు అయినా మృతుడు పంగ సాయికృష్ణ అను నతడు తాను పుట్టినప్పటి నుండి మానసికంగా వికలాంగుడు కావున సరిగ్గా ఉండకుండా బడికి కూడా పోకుండా ఇంటి వద్దనే ఉండేవాడు. అట్టి క్రమంలో రోజు ఇంటి వద్దనే పిల్లలతో ఆడుకుంటూ ఉండేవాడు. నా భార్య అయిన పంగ భవాని మా ఊరి లోని పార్ట్ టైం స్లీపర్ గా పనిచేస్తుంది. రోజు ఆమెతో నా కొడుకు వెళ్లి అక్కడ పని పూర్తి అయిన తర్వాత ఇంటికి వచ్చేవారు. ప్రస్తుతం స్కూలు హాలిడేస్ ఉన్నందున ఇంటి వద్ద ఉంటున్నాడు. అట్టి క్రమంలో గురువారం అన్నం తిని రోజు వారీగా ఆడుకునేందుకు బయటికి వెళ్లి తిరిగి



ఎంతసేపటికి రాకపోవడంతో చుట్టు పక్కల ఇళ్లల్లో ఎక్కడ వెతికిన తన ఆచూకీ లభించలేదు. ఊరంతా వెతికిన ఎక్కడ దొరకకపోవడంతో అప్పుడప్పుడు మా ఇంటి ముందు గల కొంపెల్లి శశిధర్ వాళ్ల చేత బావి వద్ద ఆడుకుంటుం దేవాడని అనుమానంతో బావిలో పడ్డాడేమోనని పంగ వంశీ, చిప్ప శ్రీకాంత్ అనువారు పాతాల గరిగే తో పట్టి చేద బావిలో అందాద సాయత్రం వెతకగా నా కొడుకు మృతదేహం కనిపించడంతో పాతాల గరిగే సహాయంతో పైకి తీసినారు. నా కొడుకు మానసిక పరిస్థితి సరిగ్గా లేక మా ఇంటి వద్దే ఉంటూ ఆడుకునేవాడని అట్టి క్రమంలో ప్రమాదవశాత్తు చేద బావిలో పడి చనిపోయాడని అంతేకానీ నా కొడుకు మరణం పట్ల ఎవరి పైన ఎలాంటి అనుమానం లేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జూలపల్లి ఎస్సై సిహెచ్. సనత్ కుమార్ తెలిపారు.

# యువకుని అనుమానాస్పద మృతి

**కరీంనగర్ క్రైమ్, ప్రభాత వార్త:**

నగరంలోని సప్తగిరి కాలనీకి చెందిన యువకుడు మంకమ్మ తోటలోని తను నిర్వహిస్తున్న షాప్ లో ఉరివేసుకొని ఆత్మహత్యలు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సప్తగిరి కాలనీకి చెందిన తులసి సురేష్ (36) మంకమ్మ తోటలోని పాత లేబరెడ్డ వద్ద తులసి ఆన్లైన్ సర్వీస్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రతిరోజు లాగే బుధవారం షాప్ తెరిచిన సురేష్ మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి భోజనం చేసి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసిన



స్పందించకపోవడంతో గురువారం ఉదయం సురేష్ స్నేహితుడైన రమేష్ కు ఫోన్ చేసి విషయం వివరించగా షాపు వద్దకు వెళ్లి చూడగా సురేష్ ద్విచక్ర వాహనం అక్కడే ఉంది. వెంటనే అనుమానం వచ్చి షాప్ తెరిచి చూడగా సీలింగ్కు ఉరివేసుకొని మృతి చెందిన సురేష్ కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుని తల్లి భాగ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి తెలిపారు.

# దైవ దర్శనానికి వెళ్లిన వృద్ధుడి అదృశ్యం

**గొల్లపల్లి, ప్రభాతవార్త:**



దైవ దర్శనానికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు 15 రోజులైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన వేల్పుల మల్లయ్య (65) ఈ నెల 13వ తేదీన కొండగట్టు, వేములవాడ దైవ దర్శనానికి వెళుతున్నానని కుటుంబ సభ్యులకు తెలిపి వెళ్లాడు. అయితే 15 రోజులైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు రామయ్య గొల్లపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై ఎం కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

# మంటల్లో చిక్కుకొని మరణించిన రైతు

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**

మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో గురువారం రైతు అకాల మరణం గ్రామస్తులను కలచివేసింది. తన పొలంలోవరి కోయలను తగులబెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని ఎలుక నారాయణ (60) అనే వృద్ధ రైతు ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రైతు నారాయణ తన పొలంలో వరి కోతలు పూర్తయిన తర్వాత మిగిలిన కొయ్యలకు గురువారం నిప్పు పెట్టాడు. అయితే ఎండ తీవ్రత, గాలి ప్రభావంతో ఒక్కసారిగా మంటలు వేగంగా వ్యాపించాయి. పొలమంతా దట్టమైన



పొగ అలుముకోవడంతో, నారాయణ మంటల్లో నుండి బయటకు రాలేకపోయాడు. పొగ కారణంగా ఊపిరాడక ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన పక్క పొలాల రైతులు, గ్రామస్థులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసి సహాయక చర్యలు చేపట్టినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# మృతురాల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జగిత్యాల కోర్టులో రూరల్ పోలీస్ కానిస్టేబుల్ గుండ హరి ప్రసాద్ తల్లి గుండ లక్ష్మి మ్మ మరణించగా వారి కుటుంబ సభ్యులను విద్యానగర్ లో పరామర్శించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ వెంట నాయకులు సమిండ్ల శ్రీనివాస్ దయల శంకర్ బద్దం జగన్ మోహన్ రెడ్డి బోయినపల్లి ప్రశాంత్ రావు శరత్ రావు నాయకులు తదితరులు ఉన్నారు.



# ప్రజలు కష్టాల్లో ఉంటే కనిపించకుండా పోయిన కోరుట్ల ఎమ్మెల్యే

**కోరుట్ల, ప్రభాతవార్త :**

గత శాసనసభ ఎన్నికల్లో తాను మెట్పల్లి లో నివాసం ఉంటానని నమ్మబలికి ఓట్లు దండుకొని కనిపించకుండా పోయిన స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ అబద్దాలకోరు అని అతని మాటలు ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని కోరుట్ల పట్టణంలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ చాలా గొప్పగా భావిస్తారని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తార,ని ఇలాంటి పండగల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఎక్కడ కనపడడని ముస్లిం సోదరులను పలకరించిన పాపాన కూడా పోడని అన్నారు. ముస్లిం సోదరుల ఓట్లతో గెలుపొంది నేడు వారికి ముఖం కూడా చూపించకుండా



నియోజకవర్గంలోనే లేకుండా ఎక్కడెక్కడో నివాసం ఉంటున్నాడని అన్నారు. వేసవికాలం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల నియోజకవర్గంలో ఈతవనాలు, తాటివనాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయని దీనివల్ల గీత వృత్తి పై ఆధారపడిన గౌడ సోదరులు తమ ఉపాధిని కోల్పోతున్నారని, ఈ సమయంలో స్థానికంగా ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకొని గౌడన్న లకుదైర్యం చెప్పాల్సిన బాధ్యత ఉన్న స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలో లేకుండా అసలు రాష్ట్రంలో ఎక్కడ ఉన్నాడో కూడా ప్రజలకు సమాచారం లేకుండా ఉన్నాడని జువ్వాడి కృష్ణారావు అన్నారు. ప్రజా ప్రతినిధులు ఓట్ల కోసమే కాదు ప్రజల కష్టసుఖాల్లో కూడా పాలుపంచుకోవాలని కృష్ణారావు అన్నారు. కేవలం ఓట్లు తప్ప ప్రజలతో అవసరం లేనివిధంగా ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టించుకోని ఎమ్మెల్యేకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మణ్, మేడిపల్లి శిరీష, సోగ్రబి, శేఖర్ రెడ్డి, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, వాసీదు, సంగ లింగం చిట్యాల లక్ష్మీనారాయణ, తెడ్డు విజయ్, ఏ ఆర్ అక్బర్, బలిజ శివ, ఎతిరాజం నర్సయ్యా, షహీద్ మహ్మద్ షేక్, సదుల వెంకటస్వామి, బన్న రాజేష్, నసీర్, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు

కోరుట్ల వార్త

## జూన్ 5న జరిగే ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలి

**మహబూబాబాద్ టౌన్,మే28,ప్రభాతవార్త:**



ప్రభుత్వ విద్య పటిష్టత విస్తరణకై జూన్ 5న హైద్రాబాద్‌లో జరిగే ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బలాష్టి రమేష్, నెల్లుట్ల భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బాలికొన్నత పాఠశాలలో సంబందిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పటిష్టతకు కేంద్రప్రభుత్వం తన బడ్జెట్‌లో 10శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 20శాతం నిధులు కేటాయించాలని, ప్రస్తుతం కొనసాగుతున్న రెసిడెన్షియల్ స్కూళ్లకే పక్కా భవనాలు, భౌతిక వసతులు కల్పించి ప్రభుత్వం ఆశించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ఎత్తివేయాలన్నారు. విద్యాశాఖ విడుదల చేసిన ఉపాద్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను తక్షణమే విరమించుకోవాలని, మధ్యాహ్న భోజన పథకంలో అల్పహారం స్నాక్స్‌కు సంబందించిన విషయంలో ఇస్కాన్ సంస్థకు, వందేమాతరం ఫౌండేషన్‌లకు అప్పజెప్పే నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. అదేవిధంగా పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, భోధనేతర సిబ్బంది పోస్టులను, ఎంఈఓ, డిఈవో పోస్టులను తక్షణమే భర్తీ చేసి పర్యవేక్షణ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మైస శ్రీనివాస్, వివేకానంద, యాదగిరి, విష్ణువర్ధన్, వీరయ్య, బొల్లం శ్రీనివాస్, ఉపేందర్, దేవేంద్రచారి, సైదులు రెడ్డి, ఉపేందర్, వెంకటేశ్వర్లు, యాకయ్య, లింగారెడ్డి, బిక్షపతి, ప్రభాకర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భీముడు, రవి, శ్రీనివాస్, సంజీవ, మోహిన్, పాపయ్య, మధు, మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు

**చిన్నగూడూరు,మే28,ప్రభాతవార్త:**

చిన్నగూడూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లిం సొదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఈద్గా, మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం సొదరులకు చిన్నగూడూరు ఎస్సై కుశకుమార్ శుభాకాంక్షలు తెలిపారు.



## గార్లలో ఘనంగా బక్రీద్ పర్వదినం

**గార్ల,మే28,ప్రభాతవార్త:**



గార్ల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని ఆనవాయితీ ప్రకారం తెల్లవారుజామున మసీదులో ప్రార్థనలు చేసిన అనంతరం ఈద్గాలో ముస్లింలు మత గురువు ఆధ్వర్యంలో సామూహిక ప్రార్ధనలు చేశారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఖుర్బాని ఇచ్చి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీద్ ఇమామ్ బక్రీద్ విశిష్టతను వివరించారు. ఈ మేరకు ముస్లిం కుటుంబాలు పొటేళ్లను బలిచ్చి మంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం తమ కుటుంబానికి, రెండోభాగం ఇరుగు పొరుగు వారికి, మూడవ భాగం పేదలకు, ఫకీర్లకు దానం చేశారు. బక్రీద్ సందర్భంగా సొసైటి చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, జాటోతు ఝాన్సీ లక్ష్మి, సర్పంచ్‌లు పార్వతిహతిరాంనాయక్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగావత్ రాంసింగ్‌నాయక్, భూక్య రాంసింగ్ నాయక్, నాగరాజు, చౌహన్, వెంకట్‌లాల్, శ్రీనివాస్, రమేష్, ఖదీర్‌బాబా, వెంకటరెడ్డి, రాముగౌడ్, శంషాద్‌బేగం, రామారావు, కృష్ణగౌడ్ తదితరులు ముస్లిం సొదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ముస్లింలు పాల్గొన్నారు.

## గార్లలో ఘనంగా ఎన్.టి.ఆర్ జయంతి వేడుకలు



**గార్ల,మే28,ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు 103వ జయంతిని పురస్కరించుకొని గురువారం టిడిపి పార్టీ మండల అధ్యక్షులు ఎలమరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులతో కలసి ఎన్.టి.ఆర్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో టిడిపి పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. సత్యంగౌడ్, రమేష్, యాదగిరి, ప్రసాద్, శివాజి, రాంజీ, దశరథ్, బుచ్చానాయక్, ఖాసింబి, అభిమానులు శ్రీనివాస్, లింగయ్య, వినోద, సక్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**కోరుట్ల, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, ఐజేయూ143 రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుల రాంగోపాల్ మాతృ మూర్తి గంగుల రాంబాయి ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ గురువారం రాంగోపాల్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. గంగుల రాంబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాంగోపాల్ సోదరులు గంగుల సత్యర్థ ప్రకాష్, గంగుల రణధీర్ లను ఓదార్చారు. తుల ఉమ వెంట తుల రాజేందర్, కల్లూరు మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, శికారి గోపికృష్ణ, రమేష్, రాజు నాయక్, శ్రీనివాస్,రాజు తదితరులు ఉన్నారు

## వెన్నుపూస గాయంతో బతుకు పోరాటం

### -ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

**చిన్నగూడూరు,మే28,ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వెన్నుపూస దెబ్బతినడంతో బ్రతుకు జీవన పోరాటం చేస్తున్న ఘటన చిన్నగూడూరు మండలంలో చొటోచేసుకుంది. వివరాల్లోకి వెళితె మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన నాగేల్లి వెంకటేశ్వర్లు వయసు 40సంవత్సరాలు బతుకుదెరువు కోసం హైద్రాబాద్‌లో పనిచేస్తూ సొంతింటికి వస్తున్న క్రమంలో 2021లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నుపూసకు తీవ్రగాయం కావడంతో చికిత్స తీసుకున్నా ప్రస్తుతం మంచానికే పరిమితమైయ్యాడు. వైద్య చికిత్స కోసం అందినకాడికల్లా అప్పుతెచ్చి దాదాపు పది లక్షల వరకు ఖర్చు చేసిన కోలుకోలేని స్థితిలో ఉన్నాడు. దీంతో కుటుంబం పూట గడవడానికి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు తల్లిదండ్రులను పోషిస్తాడు అనుకుంటే అదే తల్లిదండ్రులు కూలి, నాలి పని చేస్తుంటే వారి మీద ఆధారపడి బ్రతుకుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వెంకటేశ్వర్లకు ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ప్రమాదం జరిగిన ఆరు సంవత్సరాలు అవుతుందని ఇంత వరకు పెన్షన్ కూడా రావడం లేదని సదరన్ క్యాంపు సర్టిఫికెట్ కూడా ఉందని మరల ఈ మద్యనే పెన్షన్‌కు ధరఖాస్తు చేసినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని, దాతలు సహకరించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నాడు. ఎవరైనా దాతలు సహకరిస్తే ఫోన్ నెంబర్ 9553671746 ను సంప్రదించాలని వారు కోరుతున్నారు.

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**గార్ల,మే28,ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అసంఘటిత రంగంలో పనిచేసునతన్న హమాలీ లకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జనగామలో నిర్వహించనున్న ఆ సంఘం రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని గురువారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఎగుమతులు, దిగుమతులు నిర్వహిస్తున్న హమాలీలకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో హమాలీలకు పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా, పెన్షన్ తదితర సౌకర్యాలతో హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

**రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి:కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి: మే 28, ప్రభాతవార్త:**



జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి, నిల్వలను వెంటనే గోదాములకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు తీరును, నిల్వల పరిస్థితిని, రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, ఇంకా ఎంత కొనుగోలు చేయాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యపు సంచులను ఎప్పటికప్పుడు గోదాములకు, రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని లారీలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లారీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. రైస్ మిల్లుల సామర్థ్యం, ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే వాహనాలు నిలిచిపోకుండా వెంట వెంటనే అన్‌లోడింగ్ పూర్తి చేసి తిరిగి కేంద్రాలకు పంపించాలని సూచించారు. అవసరమైతే అదనపు హమాలీలను నియమించుకోవాలని మిల్లుల నిర్వాహకులకు తెలిపారు. అలాగే మిల్లుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. అధికారులు నిరక్ష్యంల్ల చేయకుండా బాధ్యతగా పనిచేసి గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ధాన్యం నిల్వలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గడువులోగా నిల్వలను గోదాములకు తరలించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ధాన్యం మెట్రిక్ టన్నుల వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పెంచికల్‌పాడు గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ స్థలం ఉందని గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ తెలియజేయడంతో అక్కడ గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, కుంటాల తహసిల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు భీమ్ పుట్టిన గడ్డకు రాష్ట్ర గవర్నర్

**-పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 28, ప్రభాతవార్త :**



జల్ జంగిల్ జమీన్ కోసం అసువులు బాసి చరిత్రలో నిలిచిన మహావీరుడు కొమరం భీం, ఎడ్లకొండు పుట్టిన గడ్డకు శుక్రవారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల రానున్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం వాటిని దత్తత తీసుకొని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్కు చెందిన ప్రముఖ క్రికెటర్ నాగేంద్ర ఆసిఫాబాద్ మండలంలోని రౌటసంఖపెల్లిని దత్తత తీసుకున్నారు. ఇప్పటివరకు అభివృద్ధికి నోచుకోని పోరాట గ్రామాన్ని ఎలాగైనా అభివృద్ధి చేయాలని సంకల్పం పెట్టుకొని కొమురం భీం స్ఫూర్తిని గ్రామోత్సవం పేరుతో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి గవర్నర్ ను ఆహ్వానించడంతోపాటు ఆయనను గ్రామానికి తీసుకురావడంలో విజయం సాధించారు. దీనిలో భాగంగానే ఈ గ్రామానికి రాష్ట్ర గవర్నర్ రానున్నారు.

### గవర్నర్ పర్యటన...

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఉదయం 10:35కు ప్రత్యేక హెలికాప్టర్ లో కలెక్టరేట్ కు చేరుకొని అధికారులతో రెండు గంటలపాటు సమావేశాన్ని నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు గ్రామంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొనడంతో పాటు, గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గ్రామంలో కొమురం భీం, ఎడ్లకొండుల 20 అడుగుల కాంస్య విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రామాల్లో సోలార్ ప్యానల్, వీధి దీపాల ఏర్పాటు, ఆరోగ్యం కార్డులు, సంక్షేమ కార్డుల పంపిణీ చేయనున్నారు. మద్యపాన నిషేధంపై గ్రామస్తులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్నారు.

### గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

కుమురంభీం జిల్లాలో పర్యటించనున్న గవర్నర్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె.హరిత ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండగా, దత్తత గ్రామంలో నిర్వహించనున్న వివిధ రకాల కార్యక్రమాలను గ్రామోత్సవ కమిటీ నాయకులు గుణవంతురావ్, సలహాదారు సిడాం అర్జు, కోఆర్డినేటర్ వెంకటేష్ లు పర్యవేక్షిస్తున్నారు.

## జిల్లాలో ధాన్యం కొనుగోలుకేంద్రాలు గోదాముల తనిఖీ

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**

జనగామ జిల్లాలో ధాన్యంసేకరణ, నిల్వ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అదనపు కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈసందర్భంగాధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోదాములను స్వయంగా సందర్శించి జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పిట్టలగుట్టగోదాం వద్ద జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పనులను వేగవంతంచేయాలని అధికారులకు సూచించారు. అలాగే రఘునాథపల్లిలోని ఐకేపీ ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యంసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తరిగొప్పుల మండలంలోని పాక్స్‌గోదామును సందర్శించి, అక్కడ జరుగుతున్న అన్‌లోడింగ్ ప్రక్రియను సమీక్షించారు. లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల గోదాములను పరిశీలించి ధాన్యం నిల్వలపై అధికారులకు తగు సూచనలు చేశారు. రైతులు పండించిన ప్రతి బగింజను కొనుగోలు చేస్తామని, ధాన్యంసేకరణలో ఎటువంటి జాప్యంజరగకుండా అన్నిజాగ్రత్తలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. గోదాముల్లో ధాన్యం నిల్వ చేసేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, రవాణఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జిల్లా సర్పంచ్‌ల సంఘం కన్వీనర్‌గా గోపగోని శ్రీధర్‌గౌడ్

**నర్మెట, మే 28 ప్రభాతవార్త :**

తెలంగాణ పంచాయతీ సర్పంచులసంఘం, తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్‌లో జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో అన్నిజిల్లాలకు అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలకొరకు జనగామ జిల్లా నుండి నర్మెట గ్రామసర్పంచ్ గోపగోని శ్రీధర్‌గౌడ్, తెలంగాణ పంచాయతీ సర్పంచులసంఘం, రాష్ట్ర అధ్యక్షుడు, చింపుల సత్యనారాయణరెడ్డి, జనగామ జిల్లాసర్పంచుల సంఘం కన్వీనర్‌గా ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామప్రజల ఆమోదంతో సర్పంచులుగా ఎన్నికైన గ్రామసర్పంచులు అందరూ చైతన్యవంతులై గ్రామాలను అభివృద్ధి పరచాలన్నారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచుల సంఘం జనగామ జిల్లా కన్వీనర్ గోపగోని శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన రాష్ట్రకమిటీకి జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలియపరుస్తూ తనతో ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన అన్ని జిల్లాల కన్వీనర్లకు శుభాకాంక్షలు తెలుపుతూ సర్పంచుల మందరం సమన్వయంగా పనిచేస్తూ పార్టీలకు అతీతంగా ఏకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా మనకు రావలసిన నిధులను, పథకాలను ప్రజలకు చేరవేస్తూ మనగ్రామాల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గంతోపాటు జనగామ జిల్లా ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 28, ప్రభాతవార్త:**



ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ ప్రాంతంలో గల మునీందర్ అండ్ బ్రోస్ ఫర్టిలైజర్స్ గోదాంను అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాకు చెందిన ధాన్యం నిల్వ చేసేందుకు గోదాము కేటాయించడం జరిగిందని, ధాన్యం దిగుమతి వేగంగా నిర్వహించాలని, అవసరమైన మేరకు హమాలి సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**చందుర్తి / ప్రభాతవార్త:**



చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు లింగం పల్లి(నెంబర్) వెంకటి ఆధ్వర్యంలో విశ్వ విఖ్యాత నటసార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షులు నెంబర్ వెంకటి మాట్లాడుతూ, ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి, రాజకీయాల్లో నూతన ఒరవడి సృష్టించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యువత, కార్యకర్తలు, అభిమానులు పాల్గున్నారు.

## వివాదానికి తెరలేపిన మట్టి తరలింపు వ్యవహారం

**-బక్రీద్ పండుగ పూట మట్టి రవాణా**

**చందుర్తి / ప్రభాతవార్త :**



చందుర్తి మండలం మూడపల్లి ఊర చెరువు నుండి మట్టి తరలింపు విషయం వివాదానికి తేరలిపోయింది, ఊర చెరువు నుండి మట్టి తరలింపు కోసం నీటిపారుదల శాఖ నుండి అనుమతి ఉన్నప్పటికీ బక్రీద్ పండుగ రోజు గురువారం సెలవు దినమైనప్పటికీ కాంట్రాక్టర్ టిప్పర్ల ద్వారా నాలుగు గ్రామాలకు మట్టిని తరలించాడు, ప్రభుత్వ నిర్మాణాలకు మట్టిని తరలించాలంటే ప్రభుత్వ పని దినాల్లో మాత్రమే మట్టిని తరలించవలసి ఉంటుంది, అయినప్పటికీ ప్రైవేటు పనులకు సెలవు దినం రోజు టిప్పర్ల ద్వారా మట్టిని తరలించడం చేపట్టడంతో బండపల్లి మాజీ ఎంపీటీసీ గడ్డం రణధీర్ రెడ్డి సోషల్ మీడియాలో అధికారులను, ప్రభుత్వాన్ని నిలదీస్తూ పోస్టులు చేయడంతో మండలంలో వైరల్ గా మారింది, కాంట్రాక్టర్ కొంతమందిని మచ్చిక చేసుకుని సెలవు రోజు మట్టిని తరలించినట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి తరలింపు పై నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజారెడ్డి

మల్లాపూర్,ప్రభాతవార్త:



జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బిరం రాజేష్ ఆదేశాల మేరకు మల్లాపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా జావిడి రాజారెడ్డి గురువారం నియమించినట్లు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్,నియోజకవర్గ కమిటీ ఇన్చార్జ్ అమ్ముల రాహుల్,సాయిబాజ్ మోసిన్ లు పేర్కొన్నారు.రాజారెడ్డి కి నియామక పత్రం అందజేయడం జరిగిందని,గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ చేపడుతున్నటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న పథకాలను గ్రామ గ్రామాన అభివృద్ధి కోసం ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా యువజన కాంగ్రెస్ సైనికులు పనిచేయాలని వారు కోరారు.

## తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని పెద్దపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అక్కపాక తిరుపతి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. పెద్దపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ రాజకీయాల్లో నందమూరి తారక రామారావు ప్రస్థానం చెరగనిదని, తెలుగు ప్రజల గౌరవాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహానేత అని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్టీఆర్ తీసుకొచ్చిన పథకాలు నేటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులను శాలువాతో సత్కరించారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఉప్పు రాజు, కోళ్ల కిషన్ రావు, పెరిక శ్రీనివాస్, తుమ్మల శ్రీనివాస్, చెన్నూరి రమేష్, దావళ్ళ శ్రీనివాస్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## నిరంజన్ రెడ్డి కి నివాళులు అర్పించిన విప్ విజయరమణ రావు

ఓదెల,ప్రభాతవార్త:



ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉపసర్పంచ్ కోట నిరంజన్ రెడ్డి బుధవారం రోజున సుల్తానాబాద్ లో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గురువారం స్వగ్రామం అయిన మడక లో వారి నివాసానికి వెళ్లి వారి ప్రార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపిన అనంతరం నిరంజన్ రెడ్డి అంతక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి ఇతర గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు ప్రజాప్రతితులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిపి.కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఓదెల, ప్రభాతవార్త:



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు గురువారం ఓదెల మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాలు పెంచడం, మల్టీపర్పస్ విధానం రద్దు, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు సమస్యల పరిష్కారానికి జూన్ 1న మండల కార్యాలయాలు, జూన్ 8న కలెక్టరేట్లు, జూన్ 14న మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పైడిపల్లి నాగయ్య, నరేష్, శనిగరం బాపు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కరించాలి

జూన్ 1న మండల కేంద్రాల వద్ద పంచాయతీ



### కార్మికుల మహా ధర్నాకు సిఐటియు పిలుపు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 1వ తేదీన నిర్వహించ తలపెట్టిన మండల కేంద్రాల మహా ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం పెద్దపల్లి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండి ఖాజా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో రాత్రి పగలు కష్టపడుతూ, ప్రజలకు సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిరక్ష్య వైఖరిని వీడాలని వారు డిమాండ్ చేశారు. కంటికి రెప్పలా గ్రామాలను కాపాడుతున్న కార్మికులకు కనీస హక్కులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. పంచాయతీ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని, పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్ పని విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, కార్మికుల జీతాల కోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రభుత్వమే భీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన ప్రతి కార్మికుడి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు దొంత కనుకయ్య, జంగంపల్లి నరేష్, నాయకులు ముస్తఫా, ప్రభాకర్, మల్లేష్, పరుశురాం, రాజేశం, శేఖర్, నాగరాజు, శంకర్, దేవేందర్, శ్రీధర్, సది, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బక్రీద్ పండుగ

– కలెక్టర్ చొరవతో ప్రత్యేక ఏర్పాట్లు

జనగామ టౌన్, మే 28 ప్రభాతవార్త :

బక్రీద్‌పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ చొరవతో ప్రత్యేక ఏర్పాట్లపట్ల జామ మస్జీద్ కమిటీ అధ్యక్షుడు మసీహు రహమాన్ జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లాకేంద్రంలోని ఈద్గాలో గురువారం వేలాదిమంది ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ ఈదుల్ అజాన్ నమాజ్, ప్రార్థనలు నిర్వహించారన్నారు. వేసవికాలం ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంపట్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక చొరవ తీసుకొని నమాజ్ సందర్భంగా ఈద్గాలలో శ్యామ్యానాలు, చల్లటి మంచినీళ్ల సరఫరా, ఫైర్ సర్వీస్ ద్వారా సేవలతోపాటు తదితర ఏర్పాట్లు చేశారన్నారు.

# మెట్‌పల్లి వార్త

## మెట్ పల్లిలో ఘనంగా బక్రీద్ వేడుకలు

-పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు, చైర్మన్ లింబాద్రి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :







మెట్‌పల్లిలో బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని వెంకటరావుపేట ఈద్గా వద్ద ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనార్టీ సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి రైసుద్దీన్, కౌన్సిలర్లు పాల్గొని ముస్లిం లకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మైనార్టీ ప్రజలు బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ బక్రీద్ పండుగ మైనార్టీ సోదరుల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని కోరుతూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి రైసుద్దీన్, కౌన్సిలర్లు బత్తుల నరేష్, పందిరి రమేష్, నునుగొండ నరేష్, కాజా అజీమ్, మాసుల ప్రవీణ్, రెబ్బాస మహేష్ యాదవ్, గుడికందుల అజయ్, ముఖీం, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



మండలంలోని ఆత్మకూర్ గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్ష,కార్యావర్గాన్ని గురు వారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు మాసం రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్,ప్రధాన కార్యదర్శి గుర్రాల రాము, కోశాధికారి గాండ్ల రాకేష్,లను సంఘం సభ్యులు సమావేశమై ఎన్నుకున్నట్లు తెలిపారు.

## సిరిసిల్లలో ఈదురుగాలుల బీభత్సం

**.కారుపై కూలిన ట్రాన్స్ ఫార్మర్, చెట్టు!**

**పట్టణంలో స్తంభించిన విద్యుత్ సరఫరా**

**రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టిన విద్యుత్ అధికారులు**

సిరిసిల్ల బ్యూరో , ప్రభాతవార్త



సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ఒక్కసారిగా ప్రకృతి ప్రకోపించింది. రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో ఊహించని విధంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడటంతో పట్టణంలో పలుచోట్ల జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పలు ప్రాంతాలలో భారీ వృక్షాలు, కొమ్మలు విరిగిపడ్డాయి. పట్టణంలోని వెంకంపేట లో గల అమృత హాస్పిటల్ సమీపంలో ఈదురుగాలుల తీవ్రతకు ఒక భారీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఒక్కసారిగా నేలకూలింది. అదే సమయంలో దాని పక్కనే ఉన్న ఒక పెద్ద చెట్టు కూడా విరిగి, అక్కడ పార్క్ చేసి ఉన్న మారుతి సుజుకి స్విఫ్ట్ కారు పై పడింది. ఈ ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతింది. భారీ శబ్దంతో ట్రాన్స్ ఫార్మర్, చెట్టు ఒక్కసారిగా కూలడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఎవరూ లేకపోవడం, ఆ సమయంలో అక్కడ జనసంచారం లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఒక పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.ట్రాన్స్ ఫార్మర్ కూలిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపడటంతో పట్టణంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రోడ్డుపై విద్యుత్ వైర్లు, చెట్టు కొమ్మలు చెల్లాచెదురుగా పడి ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు

# భూసారం దెబ్బతిని దిగుబడులపై ప్రభావం

(పరకాల ప్రభాత వార్త )

వరి, మొక్కజొన్న కోతలను పూర్తి చేసుకున్న రైతులు గడ్డి అవసరం లేకపోవడంతో వాటిని కాల్చి వేస్తున్నారు. మళ్లీ దుక్కులను సిద్ధం చేస్తూ వరి నాట్లు వేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. పరకాల డివిజన్ వ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో పశుసంపద తగ్గిపోవడం, ఎడ్లు లేకపోవడం, పాలిచ్చే ఆవులు గేదెలు మాత్రమే ఉండటం వల్ల కొద్ది మొత్తం లోనే గడ్డిని వినియోగిస్తున్నారు. మిగతా గడ్డిని ప్రతీ సీజన్ లో కాల్చి వేస్తున్నారు. ఈ గడ్డిని కాల్చడం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు భూసారం కూడా దెబ్బతింటుంది. గడ్డిని కాల్చడం ద్వారా నత్రజని తగ్గుతుందని .. గడ్డిని నీటితో తడిపి పొలంలోనే కలిపి దున్నడం వల్ల నత్రజని పెరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. అలాగే గడ్డిని కాల్చడం ద్వారా దిగుబడి తగ్గి పర్యావరణం దెబ్బతింటుందని రైతులు గడ్డిని ఇష్టం వచ్చిన రీతిలో కాల్చి వేయొద్దని కోరుతున్నారు.

**అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిన కాల్చివేత..**

. పొలంలో కొయ్యకాలును కాల్చివేయడం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుందని శాస్త్రవేత్తలు, సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ అజ్ఞానంతో ఎంతో మేలు చేసే కొయ్యకాలును భూమిలో కలియ దున్నకుండా, కాల్చివేసి, భవిష్యత్తు పంటను నాశనం చేస్తున్నాడని, అలా తన అవగాహన లేమితో వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నాడని అంటున్నారు. కొయ్యకాలును కాల్చివేసే క్రమంలో కొయ్యకాలుతో పాటు, భూమి గట్టిపడిపోతుందని, దీంతో గట్టిపడిన భూమి, దున్నే సమయంలో సరిగా ఉండదని శాస్త్రవేత్తలు అంటున్నారు. దీంతో పొలాన్ని కలియదున్నడం వీలుకాదంటున్నారు. కాల్చివేయడం వల్ల భూమిలో సూక్ష్మజీవులు చనిపోతాయని, అలాగే వానపాములు నాశనం అవుతాయి. భూమి గుల్లగా మారదు. దీంతో నాటు వేసిన తర్వాత వేర్లకు సరిగా పోషకాలు అందవు. ఫలితంగా పైరు సరిగా పెరుగకపోవడంతో రైతులు యూరియాను ఎక్కువగా వినియెకలుగుతాయి. కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, పాలిస్టైలిక్, హైడ్రోకార్బన్ గాల్లో కలిసిపోయి జీవకోటిపై తీవ్ర ప్రభావం పడుతుంది.

## కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలములోని వెల్జి పురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గొల్లకోమటి శంకర్ తల్లి ఎల్లవ్వ మరియు సోషల్ మీడియా కన్వీనర్ సుధగోని రవీందర్ గౌడ్ తండ్రి మీనయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరామర్శించారు.కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చి మనోధైర్యాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని నవీన్,మాజీ ఎంపీపీలు ఉట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య,కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఎన్ టి ఆర్ జయంతి వేడుకలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్ టి ఆర్ జయంతి వేడుకలను నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు.చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టి టి డి పి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం పాటు పార్లమెంటు ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు ఎర్రోజు కిషన్,మండల పార్టీ కన్వీనర్ భీంకర్ ఎల్లేష్,సీనియర్ నాయకులు కేతిరెడ్డి మల్లారెడ్డి,దొమ్మాటి లక్ష్మణ్ గౌడ్,ఎమ్.డి.ఇస్మెల్,జి.వెంకటయ్య,మిద్దె మైసయ్య,దుర్శెట్టి బాలయ్య ఉన్నారు.

## మార్కెట్ యార్డును సందర్శించిన ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



ఇల్లంతకుంట మార్కెట్ యార్డును స్థానిక శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డా కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం సందర్శించారు.రైతులతో ముఖాముఖి మాట్లాడారు.ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,సన్ఫ్లవర్ సాగు పురోగతి తదితర అంశాలపై రైతులతో చర్చించారు.రైతులు దేశానికి వెన్నెముక అని,గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతు అభివృద్ధి అత్యంత ముఖ్యమని అన్నారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం కంది కట్కూరు గ్రామములో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఐరెడ్డి చైతన్య మహేందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ అయిలయ్య,ఉట్కూరి రమణారెడ్డి,స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు ఈద్గాలు

పరకాల మే 28 (ప్రభాత వార్త )

త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఆనందోత్స వాలతో నిర్వహించుకున్నారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని గురువారం ఈద్గాల్లో వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బక్రీద్ విశిష్టత గురించి వివరించారు. అనంతరం ముస్లింలను ముస్లింలు, హిందువులు ఇతరులు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గాల వద్దకు వివిధ రాజకీయ పార్టీల నేతలు ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పారు.పరకాల పట్టణంలో గురువారం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే నూతన వస్త్రాలు ధరింతారలంచేసిన క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు

# సిరిసిల్ల వార్త



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ముస్తాబాద్ ప్రభాత వార్త:



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యములో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 1 లక్ష 50 వేల రూపాయలను లబ్ధిదారులకు అందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమములో సిరిసిల్ల జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి,పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు,అన్నం శ్రీధర్, మిడిదొడ్డి భాను,రంజాన్ నరేష్,తలారి నర్సయ్య,శీల ప్రశాంత్,గోవర్ధన్ నాయక్,మామిండ్ల అంజయ్య,పుల్లూరి రవి, బండారి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు

గంభీరావుపేట, ప్రభాతవార్త



:బక్రీద్ పర్వదిన వేడుకలు గురువారము గంభీరావుపేట మండలంలో ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాలలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ వేడుకలు పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ వేడుకలలో రాష్ట్ర వక్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని పాల్గొన్నారు.

## నిధుల మంజూరు కి ప్రభుత్వ విప్ కు వినతి



గంభీరావుపేట, ప్రభాతవార్త:

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామస్తులు గురువారము వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఉప సర్పంచ్ శివంది దేవేందర్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు నేరుగా ప్రభుత్వ విప్ ను కలిసి నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న బోధర్ కాలువ పై బ్రిడ్జి నిర్మాణము, అంగన్వాడీ భవనానికి నిధులు మంజూరు తో పాటు గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా వినతి పత్రంలో కోరారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించినట్లు ఉప సర్పంచ్ దేవేందర్ ఈ సందర్భంగా తెలిపారు.

# ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

రైతు నాయకుడు ఆడెపు తిరుపతి డిమాండ్

బీర్ పూర్ ప్రభాత వార్త.



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం తుంగూరు గ్రామానికి చెందిన యువ రైతు నాయకులు ఆడెపు తిరుపతి మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పైన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులు, అకాల వర్షాల నేపథ్యంలో బీర్పూర్ మండల రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యల పైన రైతుల పక్షాన నినాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యాన్ని తక్షణమే నివారించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని బీర్పూర్ మండల రైతుల తరపున అధికారులను డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. కేంద్రాల్లో సకాలంలో గన్నీ సంచులు, లారీలు, మరియు హమాలీలను సమకూర్చకపోవడం వల్ల రైతులు ధాన్యం రాశుల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వరి ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు కొనుగోలు రసీదును (తక్ పట్టీ) తప్పనిసరిగా అందించాలని,తాలు, తప్పు పేరిట తరుగు తీస్తూ రైతులను నిట్టనిలువునా దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి, రంగు మారడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు, తరుగు లేకుండా ఈ ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలనీ మరింత ఆలస్యం చేస్తే మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, అధికార యంత్రాంగానికి తగిన ఆదేశాలు జారీ చేసి బీర్పూర్ మండల రైతాంగాన్ని ఆదుకోవాలని బీర్పూర్ మండల రైతాంగం తరపున యువ రైతు నాయకులు తిరుపతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మడలేశ్వర స్వామి పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి,దావ వసంత





జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ మోరపెల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం రోజున మడలేశ్వర స్వామి బోనాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఈ ఆధ్యాత్మిక వేడుకలో మాజీ మంత్రివర్యులు జీవనరెడ్డి,జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగలు ప్రతీకలని, భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఇలాంటి ఉత్సవాలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి,ఉప సర్పంచ్ గంగరాజం,వార్డు సభ్యులు తిరుపతి రెడ్డి,ముఖ్య నాయకులు రాము,రాజిరెడ్డి, దేవన్న,గంగాధర్,అమర్, గంగారావు, లక్ష్మణ్ రజక సంఘం సభ్యులు కొత్తకొండ లింగయ్య, గంగన్న,రాజు,నారాయణలతో పాటు రజక యూత్ నాయకులు కొత్తకొండ సతీష్,వడ్లూరి ప్రశాంత్,మహేష్,సురేష్,రాజేష్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.బోనాల ఉత్సవంతో మోరపెల్లి గ్రామంలో పండుగ వాతావరణం,ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.

# మున్సిపల్ అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా..

-కాంగ్రెస్ సేవాదళ్ నేత ముఖేష్ ఖన్నా సవాల్

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:



2020 నుంచి జగిత్యాల మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై చర్చిద్దాం" అంటూ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముఖేష్ ఖన్నా బీజేపీ నాయకులకు బహిరంగ సవాల్ విసిరారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు తహసిల్ చౌరస్తా వద్దకు రావాలని పోస్టర్లు విడుదల చేసి ఆహ్వానం పలికారు.గత కొన్ని రోజులుగా కేంద్రీయ విద్యాలయ అంశం జగిత్యాల రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని బీజేపీ నాయకులు విమర్శలు గుప్పిస్తుండగా, కాంగ్రెస్ శ్రేణులు కూడా ఎదురుదాడి ప్రారంభించాయి.ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి ముఖేష్ ఖన్నా బీజేపీ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మాజీ మున్సిపల్ చైర్పర్సన్ భోగ శ్రావణి హయాంలో జగిత్యాల మున్సిపాలిటీలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆమె చైర్పర్సన్ కావడానికి అప్పటి రాజకీయ పరిణామాల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సహకరించారని, ఇప్పుడు అదే ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం రాజకీయ దివాళాకోరుతనమని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలపై కూడా ముఖేష్ ఖన్నా స్పందించారు.నీ బతుకు కాంగ్రెస్ పెట్టిన భిక్ష" అంటూ ఎంపీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ నాయకత్వంపై మండిపడ్డారు.2020 నుంచి జగిత్యాల మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై తాము పూర్తి ఆధారాలతో చర్చకు సిద్ధంగా ఉన్నామని, మాజీ చైర్పర్సన్ భోగ శ్రావణి మరియు బీజేపీ నాయకులు కూడా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్లను పట్టణంలోని ప్రధాన రహదారులపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు.ఈనెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు జగిత్యాల తహశీల్ చౌరస్తా వద్ద బహిరంగ చర్చకు రావాలని వీడియో సందేశం ద్వారా ముఖేష్ ఖన్నా ఆహ్వానం పలికారు.

# టిడిపి అహంకార పూరిత చర్యలకు నిదర్శనం



మాజీ మంత్రి బి ఆర్ఎస్ పార్టీ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

టీడీపీ నాయకుడు బక్కని నరసింహులు ఒక తెలంగాణ బిడ్డ అయి ఉండి తెలంగాణ పదం డిక్షనరీలో లేదనడం టిడిపి అహంకార పూరిత చర్యలకు నిదర్శనం అని మాజీ మంత్రివర్యులు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడుస్తున్నప్పటికీ నేటికీ టిడిపి అధినాయకుడు చంద్రబాబు నాయుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును జీర్ణించుకోలేకపోతున్నారు.తెలంగాణ పట్ల టీడీపీ కి ఉన్న అక్కసు వెళ్లగక్కుతున్నారు..నరసింహులు వ్యాఖ్యలు టీడీపీ కి సంబంధం లేకుంటే తక్షణమే చంద్ర బాబు నాయుడు ఖండించాలి. ఇంతవరకు నరసింహులు వ్యాఖ్యలను ఖండించకపోవటంతో ఆయన వ్యాఖ్యలను చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలుగా భావించాల్సి వస్తుంది. తెలంగాణ ఉద్యమాల గడ్డ..నైజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి.. నక్సల్ బరి ఉద్యమానికి ప్రతీక..తెలంగాణ ఉద్యమం కోసం తన పదవిని త్యాగం చేసి, ఉద్యమ పార్టీ నెలకొల్పి, దేశంలో అన్ని పార్టీలను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా ఒప్పించి, రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసిఆర్ దక్కుతుంది.

# జగిత్యాల వార్త

## తెలంగాణ పదం కాదు.. మా జీవన విధానం

-బక్కని నర్సింహులు వ్యాఖ్యలపై

తెలంగాణ ఉద్యమకారుడుమోరపల్లి ప్రదీప్ కుమార్ ధ్వజం

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



తెలంగాణ అనేది డిక్షనరీలో వెతికే సాధారణ పదం కాదని,అది నాలుగు కోట్ల ప్రజల హృదయ నాదమని,తెలంగాణ వారి జీవన విధానమని తెలంగాణ వాది,ఉద్యమకారుడు,గాయకుడు ప్రదీప్ కుమార్ మోరపల్లి స్పష్టం చేశారు. తెలుగుదేశం మహానాడు వేదికగా తెలంగాణకు చెందిన పూర్వ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు తన ప్రసంగంలో తెలంగాణపై నోటికి వచ్చినట్లు మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు.ఈ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని,ఆయన అహంకార పూరిత ధోరణికి ఇవి నిదర్శనమని ధ్వజమెత్తారు.రాష్ట్రం సిద్ధించి పదేళ్లు గడిచినా పసుపు బ్యాచ్ ఇంకా తెలంగాణపై విషం కక్కుతూనే ఉందని,దానికి 'జై తెలంగాణ' నినాదం ఒక్కటే సరైన విరుగుడు అని ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.మరోమారు తెలంగాణ సమాజమంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని,ఆ ఐక్యత,నినాదమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పిలుపునిచ్చారు. మన వేలితో మన కన్నే పొడిచే విధంగా కుట్రలు చేస్తున్న సీమాంధ్ర 'బాబులు'చిల్లర వేషాలు తెలంగాణలో సాగవని హెచ్చరించారు. తెలంగాణ అనేది చరిత్రలో,శాసనాలలో సాహిత్యం లో సుస్థిర స్థానం సంపాదించుకుందని దీనిపై కనీస అవగాహన లేని బక్కని నర్సింహులును ఒక అజ్ఞానిగా భావిస్తున్నామని ఎద్దేవా చేశారు.చంద్రబాబు నాయుడి మెప్పు కోసం కన్నతల్లి లాంటి తెలంగాణను చులకన చేసి మాట్లాడటాన్ని భవిష్యత్తు క్షమించదన్నారు కన్నతల్లి పాలు తాగి రొమ్ము గుద్దే ఇటువంటి తొత్తుల వల్లే తెలంగాణకు భవిష్యత్తులో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నా బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను 'రెండు కళ్ల సిద్ధాంత' పితామహుడు చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలుగానే భావిస్తున్నామని,ఒకవేళ చంద్రబాబుకు ఆ ఆలోచన లేకపోతే ఆయన వెంటనే ఈ వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ పట్ల అనుచిత,అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన నర్సింహులు యావత్ తెలంగాణ సమాజానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు.

## ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:





బక్రీద్‌ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముస్లిం సోదర,సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన్ని శాంతి, సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జగిత్యాల,కోరుట్ల లో గల పలు ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ గారు స్వయంగా పరిశీలించారు. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లావ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ఇది ఎవరి బాధ్యత...?

**అధికారులు స్పందించరు, ప్రజాప్రతినిధులు పట్టించుకోరు..**

**వెల్ది నుండి లక్ష్మీపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై పడ్డ విద్యుత్ స్తంభాలు, చెట్లు..**

**రెండు రోజులుగా రాకపోకలు నిలిపివేత..**

**ఆర్టీసీ బస్సు సేవలు బంద్..**

**ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు**

*మానకొండూర్, ప్రభాతవార్త:*

భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు విరిగి నేలమట్టమైయి, రెండు రోజులుగా ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయినప్పటికీ ప్రజా సమస్యలను పరిష్కరించవలసిన మండల అధికారులు స్పందించడం లేదని, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని, ప్రజా సమస్యలను పట్టించుకునేది ఎవరు అంటూ పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మానకొండూరు మండల పరిధిలోని వెల్ది నుండి లక్ష్మీపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పై మంగళవారం రాత్రి గాలి వాన బీభత్సవానికి విద్యుత్ స్తంభాలు, ప్రధాన రహదారిపై ఉన్న భారీ చెట్లు విరిగి నేలమట్టమయ్యాయి. దీంతో మూడు రోజులుగా వెల్ది నుండి లక్ష్మీపూర్ కు వెళ్లే వాహనాలు రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షానికి కారణంగా ప్రధాన రహదారిపై సుమారుగా 15 భారీ చెట్లు, 8 విద్యుత్ స్తంభాలు విరిగి నేలమట్టమయ్యాయి. మూడు రోజులు గడుస్తున్న ప్రజా సమస్యను పరిష్కరించవలసిన సంబంధిత అధికారులు మండలంలో ఉన్నారా..? ఉంటే పట్టించుకునే నాధుడే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా మేమున్నామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చే ప్రజా ప్రతినిధులకు మూడు రోజుల నుండి సమస్యలు కనిపించడం లేదా అని ఆరోపణ వినిపిస్తున్నాయి . మండల సంబంధిత అధికారులు పట్టించుకోరు, రెండు గ్రామాల సరిహద్దుల మధ్య జరిగిన సమస్యపై రెండు గ్రామాల సర్పంచులు మా పరిధి కాదు అంటూ పట్టించుకోవడంలేదని, మా సమస్యలను పట్టించుకునే పట్టించుకునేది ఎవరు అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు రోజులుగా ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోవడంతో వెల్ది, వెగురుపల్లి, లక్ష్మీపూర్, ఊటూరు, పచ్చునూర్, సుల్తానాబాద్ మండలం కు వెళ్లే వాహనాదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలి బీభత్సవానికి లక్ష్మీపూర్ నుండి వెల్ది కి వెళ్లే ప్రధాన విద్యుత్ లైన్ స్తంభాలు విరిగి నేలపై పడడంతో అప్పటినుండి విద్యుత్ సరపర గ్రామానికి నిలిచిపోయిందన్నారు. ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభాలు చెట్లు విరగడంతో రహదారి లేక పలు వాహనాదారులు వ్యవసాయ పొలంలో నుండి వెళ్లాల్సిన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెల్ది గ్రామానికి వెళ్లే ఆర్టీసీ బస్ సేవలను మూడు రోజుల నుండి అధికారులు నిలిపివేశారు. దీంతో గ్రామ ప్రజలు కరీంనగర్ పట్టణం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రధాన రహదారిపై పడ్డ విద్యుత్ స్తంభాలు చెట్లను తొలగించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.







## ధాన్యం కొనుగోళ్లలో జిల్లా ఆదర్శంగా నిలవాలి

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావద్దు**

**పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్**

*కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:*

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. గురువారంకరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పురోగతి, రైతులకు చెల్లింపులు, మిల్లులకు ధాన్యం తరలింపు తదితర అంశాలపై అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ మహేశ్వర్, పౌరసరఫరాల శాఖ, వివిధ శాఖల అధికారులతో పాటు రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను మరింత స్పీడ్ అప్ చేయాలని సూచించారు. ఇప్పటికే 115 కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ పూర్తయ్యిందని, మిగతా కేంద్రాల్లో కూడా త్వరితగతిన కొనుగోళ్ల పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడికక్కడ వెంటనే లోడింగ్ చేపట్టి మిల్లులకు తరలించాలని, మిల్లుల్లో కూడా సత్వరమే అన్లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా వెంట వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని స్పష్టం చేశారు. అధికారులంతా సమన్వయంతో, పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని, కొనుగోళ్ల నిర్వహణలో కరీంనగర్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. టార్పాలిన్లు, హమాలీలు, లారీలు తదితర అవసరాల్లో ఎలాంటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై అధికారి నర్సింగరావు, సివిల్ సప్లై డీఎం రజనీకాంత్, సహకార అధికారి రామానుజాచార్యులు, ఇతర శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.




# కరీంనగర్ వార్త

## పొదుపు సహకార సంఘం అధ్యక్షుడిగా జాప దేవేందర్ రెడ్డి ఎన్నిక:

*తిమ్మాపూర్, ప్రభాత వార్త :*

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరులో గల శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సహకార సంఘం 15వ వార్షిక మహాసభ సంఘ కార్యాలయంలో చౌదరి పరిశరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ పాలకవర్గంలో ఖాళీగా ఉన్న నాలుగు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చింతం శ్రీనివాస్ ప్రకటించారు. అనంతరం అధ్యక్ష పదవికి మూడు నామినేషన్లు రావడంతో ఎన్నిక నిర్వహించారు. ఓట్ల లెక్కింపులో సమాన ఓట్లు రావడంతో డ్రా నిర్వహించగా జాప దేవేందర్ రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి అగునూరి నరేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మాదన వీరయ్య, గుంటి వెంకటేశ్వర్లు, ఒడ్నాల నారాయణ, కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎల్లాల ఏకానందం, నాగపురి శ్రీనివాస్, పైడిపల్లి మల్లేశం, ఆకుల తిరుమలరావు, చింతం శ్రీనివాస్, కొలిపాక సారయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు చౌదరి దేవేంద్ర, సంఘ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## హుజురాబాద్ లో ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

*హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:*

హుజురాబాద్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్ద బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించారు. ఖురాన్ లో చెప్పిన విషయాలను తూచా తప్పకుండా ప్రతి ముస్లింలు పాటించాలన్నారు. శాంతియుతంగా జీవించాలని, పేదలకు సాయం చేయాలని, ప్రజలందరూ ధనిక, పేద తేడా లేకుండా పండుగ జరుపుకోవాలని తెలిపారు. త్యాగానికి బక్రీద్ పండుగ నిదర్శనం అని అన్నారు. ప్రార్థన అనంతరం చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ముక్తి సాకేర్, జామే మస్జిద్ ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజ్ మెంట్ కమిటి అధ్యక్షుడు ఎండి. ముజాహిద్ హుస్సేన్, కమిటి సభ్యులు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక సేవలో జైపాల్ రెడ్డి ప్రస్థానం అందరికి ఆదర్శం

## -- అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు, వెనుకబడిన వర్గాలకు నిరంతరం అండగా నిలుస్తూ, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న జయన్న ఫౌండేషన్ చైర్మన్ గుడిపాటి జైపాల్ రెడ్డికి ఘన సన్మానం జరిగింది. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గుడిపాటి జైపాల్ రెడ్డి కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే పరిమితం కాకుండా, సమాజం పట్ల బాధ్యత కలిగిన గొప్ప సేవా తత్పరుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కష్టాల్లో ఉన్న ఎంతో మందికి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ, నిరుపేదల ముఖాల్లో వెలుగులు నింపుతున్నారని ప్రశంసించారు. ఆయన చేస్తున్న నిరంతర సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, జైపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మరికొంతమంది యువకులు, ప్రముఖులు సామాజిక సేవా రంగంలోకి ముందుకు రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జయన్న ఫౌండేషన్ చైర్మన్‌తో పాటు సమాజంలో, తమ రంగాలలో విశేష సేవలందిస్తున్న డిటిఎఫ్ నాయకులు పలకల ఈశ్వర్ రెడ్డి, బిసి సామాజిక వర్గ ప్రముఖ నాయకులు అమరేందర్‌లను కూడా ఉత్సవ కమిటీ ప్రతినిధులు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. సేవా దృక్పథంతో జరిగిన ఈ సన్మాన మహోత్సవంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఆడెపు సురేందర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేల్పుల రత్నం, బీసీ జేఏసీ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, పూలే కమిటీ చైర్మన్ చల్లూరి రఘు చారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక నాయకులు, ప్రముఖులు గొర్రె చిరంజీవి, సందెల వెంకన్న, కండె తిరుపతి, బొడిగ మల్లయ్య, అంబాల రవీందర్, ప్రవీణ్, మేకల మల్లేష్, రవీందర్, కొలిపాక క్రాంతి, రేణికుంట్ల సందీప్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రైతు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి..

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:**

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను కోరారు. గురువారం హనుమకొండ కలక్టరేట్ లో నిర్వహించిన ధాన్యం సేకరణ రివ్యూ సమావేశంలో హుజూరాబాద్ నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే సమగ్రంగా మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని వరి, మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బంది నెలకొందని, రైతుల ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో నిబంధనల ప్రకారం 41 కిలోలు కాంటాలు వేయాల్సి ఉండగా.. రైతులకు అన్యాయం చేసే విధంగా తూకాలు వేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలి చార్జీల చెల్లింపులో కూడా రైతులకు నష్టం జరుగుతోందని, ప్రభుత్వం విడుదల చేసే డబ్బులు పూర్తిగా రైతులకే చేరేలా చర్యలు తీసుకోవాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లలో ఒకటైన జమ్మికుంట మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు పది రోజులకుపైగా మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే వివరించారు. తాను స్వయంగా మార్కెట్‌ను సందర్శించి గోదాములను తెరవాలని అధికారులను ఆదేశించిన తర్వాతే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. జమ్మికుంట మార్కెట్‌కు దాదాపు రెండు లక్షల సంచులు రాగా, ఇప్పటివరకు కేవలం లక్ష యాభై వేల సంచులనే కొనుగోలు చేశారని, మిగిలిన 50 వేలకుపైగా సంచులు మార్కెట్‌లోనే నిల్వ ఉన్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. మిగిలిన మొక్కజొన్నలు కూడా వెంటనే కొనుగోలు చేసేలా జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రులను కోరారు. భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి, టేకుమట్ల, చిట్యాల మండలాల రైతుల ధాన్యాన్ని అక్కడి మార్కెట్లలో కొనుగోలు చేయకపోవడంతో వారు జమ్మికుంట మార్కెట్‌కు వచ్చి ఆందోళన చేసిన విషయాన్ని కౌశిక్ రెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. రైతుకు ఎక్కడి వారైనా రైతులే అన్న భావనతో మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడి ఆ రైతుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కౌశిక్ తెలిపారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు సకాలంలో జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జమ్మికుంట మండలంలోని గోపాలపూర్ గ్రామంలో విద్యుత్ ప్రమాదం కారణంగా సుమారు 100 ఎకరాలకు సంబంధించిన మొక్కజొన్న బస్తాలు దగ్ధమైన ఘటనను కూడా ఎమ్మెల్యే సమావేశంలో ప్రస్తావించారు. నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించేలా వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ దృష్టికి ఎమ్మెల్యే పలు సమస్యలను తీసుకెళ్లారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికే నిర్మాణం పూర్తై ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు మాత్రమే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై మంత్రులు సానుకూలంగా స్పందించి రైతులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



## మహిళా సంఘ భవనాన్ని గ్రామపంచాయతీ సమీపంలోనే నిర్మించాలి...

**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;**

జమ్మికుంట మండలంలోని పాపక్కపల్లి గ్రామ మహిళా సంఘాల సభ్యుల కోసం మంజూరైన మహిళా సంఘ భవనాన్ని గ్రామపంచాయతీ సమీపంలోనే నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. మహిళా సంఘ భవనానికి ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షలు మంజూరు కాగా అట్టి నిధులతో గ్రామ శివారులోని సర్వేనెంబర్ 1087 లో ఉన్న క్రీడా ప్రాంగణం, బతుకమ్మ ఘాటు వద్ద మహిళా సంఘ భవనం నిర్మాణం చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం మహిళా సంఘ భవన నిర్మాణం చేపట్టాలని చూస్తున్న స్థలం సమీపంలోనే వరద కాలువ ఉందని అంతేకాకుండా పలువురి మృతుల సమాధులు సైతం అక్కడ ఉన్నాయని అన్నారు. ఆ ప్రదేశంలో మహిళా సంఘ భవన నిర్మాణం చేపడితే రాత్రి వేళలో మహిళా సంఘ సభ్యులకు సమావేశాలు నిర్వహించుకోవాలనుకుంటే తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని అన్నారు. అలాకాకుండా గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోనే మహిళా సంఘ భవన నిర్మాణం చేపడితే గ్రామ మహిళలందరికీ అనుకూలంగా ఉంటుందని అన్నారు. గ్రామానికి చెందిన కొందరు తమ పంతం నెగ్గాలనే ఆలోచనతో కాకుండా మహిళల పక్షాన ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఎవరి స్వలాభం కోసమో ఇతరులకు ఇబ్బందులు కలిగించాలని చూడడం సరి అయింది కాదని తక్షణమే పంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలకు, మహిళలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకొని మహిళా సంఘ భవనాన్ని గ్రామపంచాయతీ సమీపంలోనే నిర్మాణం చేపట్టేందుకు ప్రత్యేక చొరవ చూపాలని గ్రామ ప్రజలతో పాటు మహిళా సంఘాల సభ్యులు కోరారు.







## మీ రేవంతన్న కానుక.. చీరల పంపిణీ..

**జమ్మికుంట / హుజూరాబాద్, ప్రభాతవార్త:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఐదో వార్డ్ కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి మహిళా స్వయం సహాయక సంఘం ద్వారా అక్కాచెల్లెళ్లకు.. మీ రేవంతన్న కానుక చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు



సుంకరి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశిని కోటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ ఆ బస్సులకే యజమానురాలుగా కూడా చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మహిళా సంఘాలకు పక్కాభవనాలు కట్టించుటకు శ్రీకారం చుట్టారు సోలార్ ప్లాంట్ లు, పెట్రోల్ పంపుల యజమానురాలుగా ఎదిగేలాగా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు మహిళలను కోటీశ్వరులను చేయాలని మహిళలు ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబాలు చక్కగా సంతోషంగా ఉంటాయని మంచి ఉద్దేశాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను ముందు పెట్టి వారు ఆర్థికంగా ఎదగాలని అనేకమైన కార్యక్రమాలు తీసుకుంటున్నారన్నారు. మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తున్నారని, మహిళ సోదరీమణులారా ఆలోచించండి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడండి.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి.. దీవించండి.. అని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిట్టల రమేష్, రాజకుమార్, ప్రశాంత్, శివకృష్ణ, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్పీలు, ఓబీలు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు.

**వీణవంక, ప్రభాత వార్త:**

వీణవంక మండల కేంద్రంతో మండలములోని చల్లూరు,నర్సింగాపూర్ గ్రామాల్లో గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఉదయాన్నే స్నానాలు ఆచరించి ఆయా గ్రామాలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకునీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు అలీమొద్దిన్ నసీరుద్దీన్,కలిమోద్దీన్, మతీన్,పసిఒద్దీన్ ,ఆజా సు ,నసీరు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో నీటి కరవు

**-- అధికారుల వైఫల్యంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం**

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**

రాష్ట్రంలో రోజురోజుకూ భానుడి భగభగలు పెరుగుతుండటంతో ప్రజలు అల్లాడిపోతుంటే, మరోవైపు కనీస అవసరమైన తాగునీరు కూడా అందక హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పట్టణంలో నెలకొన్న తాగునీటి సంక్షోభానికి అధికారుల నిర్లక్ష్యం, పరిపాలనా వైఫల్యమే ప్రధాన కారణమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**-- రోజువారీ డిమాండ్‌లో సగం కూడా సరఫరా లేదు....!**

గత ప్రభుత్వాల హయాంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా సాగిన నీటి సరఫరా, ప్రస్తుత పాలనలో పూర్తిగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. హుజురాబాద్ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రతిరోజూ కనీసం 60 నుండి 70 లక్షల



లీటర్ల నీటి సరఫరా అవసరం ఉందన్నారు. కానీ ప్రస్తుత అధికారులు కేవలం 38 లక్షల లీటర్లకే సరఫరాను పరిమితం చేశారని గణాంకాలతో సహా వివరించారు. అవసరంలో సగం కూడా నీరు ఇవ్వలేకపోవడం స్థానిక యంత్రాంగం చేతగానితనానికి నిదర్శనమని మండిపడ్డారు.

**-- ట్యాంకర్ల కొరత... వీధుల్లో బిందెలతో ప్రజల కష్టాలు...**

పంపుల ద్వారా నీరు రాకపోవడంతో ప్రత్యామ్నాయంగా మున్సిపాలిటీ తరపున తగినన్ని వాటర్ ట్యాంకర్లను కూడా అధికారులు సమకూర్చలేకపోతున్నారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. పట్టణంలోని అనేక కాలనీల్లో ప్రజలు అర్ధరాత్రి, తెల్లవారుజామున అనే తేడా లేకుండా గంటల తరబడి ఖాళీ బిందెలతో వీధుల్లో ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఎండ తీవ్రతకు తోడు నీటి కరవు తోడవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఏసీ గదుల్లో కూర్చోవడం మానేసి, తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని అన్నారు.

**-- ప్రభుత్వం వెంటనే మేల్కోవాలి....**

ఈ తాగునీటి సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రులు వెంటనే స్పందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. హుజురాబాద్ పట్టణానికి పూర్తి స్థాయిలో నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు గానూ యుద్ధప్రాతిపదికన అత్యవసర నిధులు విడుదల చేసి, చర్యలు చేపట్టాలన్నారు. తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, సంబంధిత ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన సూచించారు. పట్టణంలో ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయి, ఎందుకు సరఫరా సగానికి పడిపోయింది....? అనే విషయాలపై సమగ్ర సర్వే చేసి, రాబోయే రోజుల్లో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన తాము పోరాడుతామని, సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులను వదిలిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

మన రజకసంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్

ఎమ్మెల్యే పేరుతో ఉన్న అనధికారిక బోర్డును వెంటనే తొలగించాలని డిమాండ్




**పెద్దపల్లి, ప్రభాతవార్త:** రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదు మన రజకసంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రజకుల భూమి వద్ద ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును కీర్తిస్తూ విజ్జన్ననగర్ బోర్డును ఏర్పాటు చేయడం యావత్ రజక సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. తెలంగాణ పోరాట యోధురాలు, వీర వనిత చిట్యాల ఐలమ్మ పేరు పెట్టాల్సింది పోయి, రాజకీయ నాయకుల పేర్లతో బోర్డులు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, కొందరు చోటమోటా నేతలు తమ స్వలాభాల కోసం రజక కులాన్ని మంటగలిపే విధంగా దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే మెప్పుకోసం కాంగ్రెస్ ముసుగులో ఉన్న రజకసంఘం నాయకుడు, తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం రజక జాతిని వాడుకోవడం సిగ్గుచేటని బొడ్డుపల్లి రమేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భజన చేయాలనుకుంటే ఇతర మార్గాలను ఎన్నుకోవచ్చునని, కానీ రజకజాతి పేరును వాడుకునే హక్కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రజకులకు 100 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, దోబీ ఘాట్ నిర్మిస్తామని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే, అధికారంలోకి వచ్చాక రజకులను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, ఇప్పుడు రజకుల భూమిపై బోర్డులు వేస్తూ రాజకీయ డ్రామాలు చేయడం మానుకోవాలని ఆగ్రహించారు. పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహరరెడ్డి రజక సంఘం నిర్వహించే బోనాల జాతరలకు వెండి కిరీటాలు, ఆభరణాలు సమర్పించడం ద్వారా సంఘం పట్ల తన భక్తిని, గౌరవాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. పేద రజకులకు పుస్తె మట్టెలు అందించడం, బియ్యం, రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు చేశారని వివరించారు. తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మపై గౌరవంతో, ఆమె విగ్రహ ఏర్పాటు చేశారని, నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కూడా ఆయన సుముఖంగా ఉన్నట్లు వివరించారు. రజక సమాజాన్ని తక్కువ అంచనా వేసి, కబళించాలని చూస్తే ఊరుకునేది లేదని, ఎమ్మెల్యే పేరుతో ఉన్న అనధికారిక బోర్డులను వెంటనే తొలగించి, వీర వనిత చిట్యాల ఐలమ్మ పేరుతో నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, రజక సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని పత్రికా ప్రకటనలో హెచ్చరించారు.

# త్యాగం,ప్రేమ, సోదరాభావానికి ప్రతీక బక్రీద్

## -ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

**అంతర్గాం-వార్త**

త్యాగం,ప్రేమ, సోదరాభావానికి ప్రతీక బక్రీద్ పండుగా అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ అన్నారు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే రామగున్డడ పట్టణం లోని ఈద్గాలను సందర్శించి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులను అందరిని కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం, మైనారిటీ ల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.రామగుండం పట్టణ అభివృద్ధి కి పెద్ద ఎత్తున



నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజిల నిర్మాణలు చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమం లో కార్పొరేటర్లు సిరిశెట్టి సతీష్ గౌడ్, ఎండి, వాజీద్ ఖాన్, నాయకులు మహమ్మద్, హాజీ పాషా, సర్వర్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# గన్ని సంచుల తొలగింపు

**కాల్వశ్రీరాంపూర్. ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాములో ఉన్న పాతబడ్డ గన్ని సంచులు తొలగించడం జరుగుతుందని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం సారయ్య గౌడ్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో గోదాములో ఉన్న లక్షలాది పాత బడి ఉపయోగ పడని గన్ని సంచులను రైతుల సంక్షేమమే లక్ష ...యంగా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టితో మిషన్ ద్వారా తొలగించమన్నారు. కాల్వ శ్రీరాంపూర్, ఓదెల రైతులు అంచనాలకు మించి కష్టపడి వేలాదికింటల మొక్కజొన్నలు పండించడం జరిగింది అన్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్ కు వందలాది మక్కల టాక్టర్లు రావడంతో మక్కల బస్తాలను హమాలీ కార్మికులతో గోదాములో నింపడం జరుగుతుంది అన్నారు. గోదాములో ఉన్న ఖాళీ గన్ని సంచుల కారణంగా మొక్కజొన్న బస్తాలు వేయడానికి ఇబ్బంది కావడంతో అట్టి కాలి గన్ని సంచులను విజయ రమణారావు చొరవుతో మిషన్ ద్వారా పూర్తిగా తొలగించి రైతులు తెచ్చిన మొక్కల బస్తాలను గోదాములో వేయడం జరుగుతుంది అన్నారు. ప్రతిపక్షాల మాటలు రైతులు నమ్మవద్దని ఎమ్మెల్యే ఏ రైతుకు కూడా ఇబ్బంది కలగకూడదని ఆలోచనతో ప్రతినిత్యం వరి ,మక్కల కొనుగోళ్ల విషయంలో విరామ మెరుగకుండా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ రైతన్నలకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు సక్రమంగా జరిగేటట్టు చూస్తున్నాడు అన్నాడు. రైతు పక్షపాతిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పై కాంగ్రెస్ నాయకులపై ప్రతిపక్షాలు ఓర్వలేనితనముతో మాట్లాడితే రైతులు నమ్మే పరిస్థితిలో లేరని సారయ్య గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సర్పంచి బంగారి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేన సదయ్య, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఎనగంటి రవి, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్ తదితరులు ఉన్నారు.

# విత్తనాలు,ఎరువులపై డీలర్లకు అవగాహన : ఏవో భాస్కర్

**ఓదెల, ప్రభాతవార్త:**

ఓదెల మండల కేంద్రం లోని రైతు వేదిక లో మండల విత్తన ఎరువుల పురుగు మందుల డీలర్స్ కి "వానాకాలం విత్తన ఎరువుల పురుగు మందుల విక్రయాలు, చట్ట పరమైన అంశాలు" పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ డీలర్స్ వానాకాలం లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన విత్తనాలు ఎరువులు పురుగు మందులు అందుబాటు లో ఉంచాలని తెలిపారు. రైతులకు అధిక ధరలకు అమ్మినట్లు ఐతే చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. అదేవిధంగా రైతు సోదరులకు ఈ వానాకాలం కి అవసరం అయిన విత్తనాలు ఎరువులు పురుగు గడ్డి మందులు అందుబాటులో ఉన్నాయి అన్నారు. రైతు సోదరులు అధీకృత డీలర్స్ వద్ద మాత్రమే విత్తనాలు ఎరువులు పురుగుమందులు కొనుగోళ్లు చేసి రశీదు పొందాలి అన్నారు. పంట కాలం పూర్తి అయ్యేవరకు రశీదు దగ్గర పెట్టుకోవాలి అన్నారు హెచ్ టి (బిటి 3)పత్తి విత్తనాల పై రైతులు అప్రమత్తంగా ఉండాలి అని కోరారు. గ్రామాల్లో తిరుగుతు అమ్ముతున్న విత్తనాలు తీసుకోవద్దని సూచించారు. అలా అమ్మేవారు గ్రామాల్లో కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వాలని ఏవో భాస్కర్ కోరారు.



# పెద్దపల్లి వార్త



## ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ వేడుకలు

ఈద్గాలు, మసీదుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు

ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన సిపి

**పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైమ్), ప్రభాతవార్త:**



బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, కరుణ, శాంతికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్‌ఉల్‌అధా) పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారని తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈద్గాలు, మసీదుల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రార్థనల సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఈద్గాల వద్ద ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు అమలు చేశామన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు, మానవత్వానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ సోదరభావంతో పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకున్నారన్నారు. పండుగ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈద్గాలు, మసీదులు, ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

## బొగ్గు నిల్వలపై సీబీఐ విచారణ జరపాలి

టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి డిమాండ్

**గోదావరిఖని,ప్రభాత వార్త:**



సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలపై యాజమాన్యం తప్పుడు లెక్కలు చెబుతోందని, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి డిమాండ్ చేశారు. గురువారం రామ గుండం రీజియన్‌లోని పలు గనుల వద్ద బొగ్గు నిల్వలను టీబీజీకేఎస్ బృందంతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. యాజమాన్యం ప్రకటిస్తున్నట్లుగా బొగ్గు నిల్వలు ఎక్కడా కనిపించడం లేదని అన్నారు. కోల్ డంపింగ్ యార్డులు ఖాళీగా ఉండగా, అక్కడ షేల్, బండరాళ్లు, కాలిపోయిన బొగ్గు బూడిద మాత్రమే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రామగుండం ఓసీపీ5 గనిలో భారీగా బొగ్గు నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ, ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు తమ బృందానికి అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు.అధికారులు సుమారు మూడున్నర లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని చెబుతున్నారని, కానీ వాస్తవానికి 40 వేల టన్నులకంటే ఎక్కువ నిల్వలు లేవని అన్నారు. బొగ్గు నిల్వలు నిజంగా ఉంటే పరిశీలనకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. బృందాన్ని అడ్డుకోవడం ద్వారా యాజమాన్యమే అనుమానాలకు తావిస్తోందన్నారు. రామగుండం డివిజన్1లో బొగ్గు నిల్వలు అధికంగా ఉంటే బొగ్గు రవాణా ఎందుకు తగ్గిందో యాజమాన్యం వెల్లడించాలని డిమాండ్ చేశారు. డివిజన్‌లో బొగ్గు ఉత్పత్తిలో కీలకమైన ఓసీపీ5 గనినుంచి రవాణా మందగించడం అనేక అనుమానాలకు దారితీస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర నాయకులు పోలాడి శ్రీనివాసరావు, ఆర్. జీవన్, ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో భానుడి భగభగలు...

**తూర్పు ద్వారం చలువ పందిళ్లలో భక్తుల సేదతీరుతున్న వైనం**

**ఎండ తీవ్రతకు విలవిల్లాడుతున్న పుణ్యక్షేత్రం...**

**అధికారుల ముందస్తు ఏర్పాట్లతో ఊరట**

మహాదేవపూర్, మే 28, ప్రభాతవార్త



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు తోడు తీవ్రమైన ఉక్కపోతతో దర్శనానికి వస్తున్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భక్తులను ఎండ దెబ్బ నుంచి కాపాడేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం తూర్పు ద్వారం ఎదుట అధికారులు భారీ చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనార్థం లైన్లలో వేచి ఉండే భక్తులు, దర్శనం ముగించుకుని బయటకు వచ్చే యాత్రికులు ఈ చలువ పందిళ్ల కింద కూర్చుని సేదతీరుతున్నారు. పందిళ్ల నీడలో సేదతీరుతూ భక్తులు కాసేపు విశ్రాంతి పొందుతున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ఈవో ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరిన్ని చర్యలు చేపట్టారు. చలువ పందిళ్లతో పాటు భక్తుల దాహార్తిని తీర్చడానికి మంచినీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు నడిచే దారుల్లో కాళ్లు కాలకుండా ఉండేందుకు తడి చాపలను పరిచారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు, వృద్ధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆలయ అర్చకులు, అధికారులు సూచిస్తున్నారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు

మొగుళ్లపల్లి, మే 28, ప్రభాత వార్త:



మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లీం సోదరులు గురువారం బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు ముస్లీం సోదరులు ఉదయాన్నే ఈద్గాలకు వెళ్ళి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షాలు తెలుపుకున్నారు. అనంతరం ఇంట్లో బందుమిత్రులకు నోరు తిపి చేశారు. ఈ కార్యక్రమంలో రజాసాహేబ్, అబ్బు, మాజార్, తాజ్, కలీల్, రఫీక్, చాంద్ పాషా, తాజుద్దీన్, బాబా, ముధసీ ర్.అబ్దుల్లమాన్, ఖాజాపాషా, ఎండి రఫీ, రహీం, సుకురు, గౌస్పషా, మైనోదిన్, మొండిసాబ్, నబీ, ఎండి రియాజ్, సుబాన్, శాదోద్దిన్ తదితరులు పాల్గోన్నారు...

## విద్యుత్ షాక్ తో ఒకరు మృతి

**తండ్రి మూడవ రోజు కార్యక్రమం లో విషాదం**

రేగొండ మే 28 ప్రభాతవార్త :

తండ్రి చనిపోయి మూడవరోజు కార్యక్రమంలో కుమారుడికి విద్యుత్ శాఖ గురై మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనుకుంట్ల గోపి (46) గురువారం ఉదయం ఇంటి ముందు ఉన్న మోటార్ ఆన్ చేసి డ్రమ్ముల్లో నీళ్లు పట్టుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ గురై మృతి చెందాడు. గోపి తండ్రి సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందగా మూడవరోజు కార్యక్రమం ఏర్పాట్లలో కుటుంబ సభ్యులు నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో ఇంటి ముందున్న మోటర్ నీళ్లు పడుతుండగా విద్యుత్ తీగ కు చెయ్యి తగిలి షాక్ కొట్టడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గోపిని రక్షి ంచేందుకు వెళ్లిన తన సోదరికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి ప్రభుత్వం జీవనోపాధి కల్పించి అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.





## బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే

భూపాలపల్లి, మే 28, ప్రభాతవార్త



బక్రీద్ పండుగను పురస్కరించుకుని భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మొహమ్మద్ ఇర్ఫాన్ ఇంటికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు విచ్చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, పిసిసి మెంబర్ చల్లూరు మధు, టౌన్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, చల్లూరి సమ్మయ్య, కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ పార్టీ సీనియర్ నాయకులు క్యాతరాజు సాంబమూర్తి, 24వ వార్డ్ కౌన్సిలర్ జ్యోతి శ్రీకాంత్, 24వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేవీ అశోక్ గౌడ్, మైనార్టీ నాయకులు మహమ్మద్ సాబీర్ ఖాన్, ఉట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సదస్సును విజయవంతం చేయాలి

**ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి**

భూపాలపల్లి, మే 28, ప్రభాతవార్త



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగే కృతజ్ఞతా సదస్సును విజయవంతం చేయాలనీ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మందల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ... తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ నెల 31న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కొరకు తెలంగాణ ప్రభుత్వం కే కేశవరావు అధ్యక్షులుగా , పొన్నం ప్రభాకర్ అద్దంకి దయాకర్ , కోదండరాం , మోతే శోభన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ సభ్యులుగా ఏర్పాటు చేసిన కమిటీకి జీవో నంబర్ 269 ద్వారా విస్తృతాధికారాలు కల్పించినందుకు కేకే కమిటీకి కృతజ్ఞతాపూర్వక సదస్సుకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు విధిగా హాజరై విజయవంతం చేయాలన్నారు. అలాగే కే కేశవరావు కమిటీ అతి త్వరగా ఉద్యమకారుల గుర్తింపును పూర్తి చేసి ఉద్యమకారులను అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు.

# చొప్పదండి వార్త



## చిన్నతనం లోనే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలి

**కౌన్సిలర్స్ యూనియన్ అధ్యక్షులు సుజిత్ రెడ్డి**

చొప్పదండి, ప్రభాతవార్త:



చిన్న వయసులో పిల్లలను క్రీడలపట్ల ప్రోత్సహించాలని అప్పుడే, పరిపక్వతతో రాటు దేలుతారని, ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని చొప్పదండి మున్సిపల్ కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షులు గుర్రం సుజిత్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం చొప్పదండి పట్టణం లో జిల్లాపరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సమ్మర్ వాలీబాల్ కోచింగ్ క్యాంపు లో పాల్గొంటున్న చిన్నారులకు గుర్రం చిన్న ఎల్లారెడ్డి ట్రస్ట్ ద్వారా టీ షర్ట్స్, షార్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సుజిత్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు ఇప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని, అప్పుడే వారికి క్రమశిక్షణ అలవర్చుకొని, జీవితం లో రాణించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్న బీమనాథుని చంద్రమోళి ని సుజిత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన తుడి లచ్చన్న

చొప్పదండి, ప్రభాతవార్త:



మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో నిరుపేద తలారి కొమురయ్యా అనారోగ్యం తో మరణించాడు. లచ్చన్న యువసేన సభ్యులు విషయం తెలపటం తో వెంటనే స్పందించిన సమాజ సేవకులు, సామాజిక వేత్త తుడి లచ్చన్న కొమురయ్యా దహన సంస్కారాల కార్యక్రమాలకు వారి కుటుంబ సభ్యులకు లచ్చన్న యువసేన ద్వారా 12000 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లచ్చన్న యువసేన సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫార్మర్ వద్ద మంటలు తప్పిన పెను ప్రమాదం

మల్యాల/ ప్రభాతవార్త



మర్యాల మండల కేంద్రంలోని ఒర్రెగడ్డ ప్రాంతంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద గురువారం మధ్యాహ్నం తీవ్రమైన ఎండల వేడికి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి, ఎండల తీవ్రత వల్లనే ఈ ప్రమాదం జరిగినట్టు తెలిసింది, స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే చేరుకొని మరమ్మతు పనులు చేశారు, కాగా, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పక్కనే దుకాణాల సముదాయాలు నెలకొనడం అందులోనే ట్రాన్స్ఫార్మర్ కూడా కలిసిపోవడం పట్ల స్థానికులు విమర్శిస్తున్నారు, అగ్ని ప్రమాద ఘటనలో నిప్పులు చుట్టుపక్కల వ్యాపిస్తే చిరు దుకాణాలకు భారీ ప్రమాదం జరిగేదని , విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ రక్షణ లేదా దుకాణాలకు రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు,

## ఉద్యమ రాజకీయాల వైపు బీఆర్ఎస్..?

### సింగరేణి లో వేడి.. కొత్త వ్యూహమా?

బాల్క సుమన్ వ్యాఖ్యల వెనుక రాజకీయ లెక్కలపై ఆసక్తికర చర్చ

గోదావరిఖని ,ప్రభాతవార్త:

హైదరాబాద్ రాజకీయాల్లో మరోసారి సింగరేణి కేంద్రబిందువైంది. తెలంగాణ భవన్‌లో జరిగిన తెలంగాణ బొగ్గగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు కేవలం వివాదానికే కాకుండా, బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై కూడా కొత్త చర్చకు దారితీశాయి. ప్రెస్‌మీట్లు, సాధారణ నిరసనలు సరిపోవు.. ప్రజల్లో చర్చకు దారితీసే ఉద్యమాలు చేయాలి" ..అన్న బాల్క సుమన్ వ్యాఖ్యలు ఇప్పుడు అధికారప్రతిపక్షాల మధ్య రాజకీయ యుద్ధానికి దారితీశాయి. జీఎం కార్యాలయాల ముట్టడులు, రైలు రోకోలు వంటి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్, టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు ప్రారంభించాయి. అయితే రాజకీయ విశ్లేషకులు మాత్రం ఈ వ్యవహారాన్ని కేవలం ఒక వివాదంగా కాకుండా, బీఆర్ఎస్ కొత్త రాజకీయ దిశగా కూడా చూస్తున్నారు.తెలంగాణ ఉద్యమం తర్వాత బీఆర్ఎస్‌కు బలమైన మాస్ కనెక్ట్ ఇచ్చిన ప్రాంతాల్లో సింగరేణి కోల్‌బెల్ట్ ఒకటి. కార్మిక సంఘాల ద్వారా గ్రామస్థాయిలో పార్టీ బలపడింది. ముఖ్యంగా టీబీజీకేఎస్ ద్వారా కార్మికుల్లో బీఆర్ఎస్‌కు ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. కానీ అధికారాన్ని కోల్పోయిన తర్వాత సింగరేణిలో పార్టీ ప్రభావం క్రమంగా తగ్గుతోందన్న భావన ఆ పార్టీ నేతల్లో పెరుగుతోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవలి కాలంలో కార్మిక సమస్యలు, ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్ కార్మికుల అసంతృప్తి, వైద్య సదుపాయాల లోపం వంటి అంశాలు కోల్‌బెల్ట్ ప్రాంతంలో మళ్లీ చర్చకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యమ రాజకీయాల ద్వారానే మళ్లీ కేడర్‌ను యాక్టివ్ చేయాలన్న ఆలోచన బీఆర్ఎస్‌లో పెరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బాల్క సుమన్ వ్యాఖ్యలు కూడా అదే వ్యూహంలో భాగమా అన్న చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకుంటోంది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని, రైలు పట్టాలపై వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. బాల్క సుమన్‌పై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ నేతలు కూడా ఇదే అంశంపై బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూ,"ఉద్యమాల పేరుతో హింసను ప్రోత్సహించడం ప్రమాదకరం" అని విమర్శిస్తున్నారు.అయితే బాల్క సుమన్ మాత్రం తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెబుతున్నారు."సింగరేణి కార్మికుల సమస్యలపై మాట్లాడితే దానిని తప్పుగా చూపిస్తున్నారు. అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ వివాదాన్ని సృష్టిస్తున్నారు" అని ఆయన వివరణ ఇచ్చారు.ఈ మొత్తం పరిణామంలో ఆసక్తికర అంశం ఏమిటంటే.. సింగరేణి ప్రాంతంలో కార్మిక సంఘాల ప్రభావం ఇంకా రాజకీయంగా ఎంత బలంగా ఉందో మరోసారి స్పష్టమవుతోంది. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కార్మికుల మద్దతు దక్కితే అది ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సింగరేణి రాజకీయాలు ఎప్పుడూ హీట్‌గానే ఉంటాయి.ప్రస్తుతం బాల్క సుమన్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం కొనసాగుతున్నా, దీని వెనుక ఉన్న అసలు ప్రశ్న మాత్రం వేరే. బీఆర్ఎస్ మళ్లీ ఉద్యమ రాజకీయాల వైపు అడుగులు వేస్తుందా? లేక ఇది కేవలం కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నమేనా? అన్నది రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## మంథని అయ్యగారి చెరువులో మట్టిని కొల్లగొడుతున్న అక్రమార్కులు..!

**-ఎలాంటి అనుమతులు లేకుండానే అడ్డగోలు విక్రయాలు**

**-చెరువు ఆకారం దెబ్బతింటోందని ప్రజల ఆందోళన**

మంథని రూరల్ ప్రభాతవార్త :







మంథని పట్టణ శివారు పరిధిలోని అయ్యగారి చెరువు అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొందరు వ్యక్తులు భారీ యంత్రాలతో చెరువులో మట్టి తవ్వకాలు చేపడుతూ ప్రభుత్వ సంపదను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.పగలు, రాత్రి అనే తేడా లేకుండా జరుగుతున్న ఈ అక్రమ మట్టి తవ్వకాలతో చెరువు సహజ స్వరూపం దెబ్బతింటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### విచ్చలవిడిగా తవ్వకాలుభారీ గుంతలు..

స్థానికుల కథనం ప్రకారం జేసీబీలతో చెరువు గర్భంలో భారీ గుంతలు తీసి మట్టిని ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలిస్తూ కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులో పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో వర్షాకాలంలో నీటి నిల్వ సామర్థం దెబ్బతింటుందని ప్రజలు చెబుతున్నారు.అలాగే ప్రమాదవశాత్తు పశువులు, చిన్నారులు, ప్రజలు గుంతల్లో పడే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు.అయ్యగారి చెరువును గుంతలమయం చేస్తున్న మట్టి మాఫియా మంథని నుంచి గోదావరిఖని వెళ్లే మార్గంలో ఉన్న అయ్యగారి చెరువును లక్ష్యంగా చేసుకుని కొందరు అక్రమార్కులు భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీలతో చెరువు గర్భంలో మట్టి తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు పేర్కొంటున్నారు.విచక్షణారహితంగా మట్టి తవ్వకాల వల్ల చెరువు పూర్తిగా గుంతలమయంగా మారుతోందని, భవిష్యత్తులో చెరువు కట్ట బలహీనపడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మంథని పట్టణ పరిధిలో కొందరు వ్యక్తులు స్థలాలు కొనుగోలు చేసి చెరువుల నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టిని అక్కడ పోసి ప్లాట్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మరికొందరు తమ వ్యక్తిగత వ్యాపార అవసరాల కోసం చెరువు మట్టిని వినియోగిస్తున్నారని చెబుతున్నారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా చెరువు మట్టిని కమర్షియల్ ప్రయోజనాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని తెలిసినా అక్రమార్కులు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు.నిజానికి చెరువుల నుంచి మట్టి తీయాలంటే రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎంత పరిమాణంలో మట్టి తీయాలి, ఎక్కడ వినియోగించాలి, పర్యావరణానికి నష్టం కలుగుతుందా లేదా అనే అంశాలను సంబంధిత శాఖలు పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలి.అలాగే కమర్షియల్ ప్రయోజనాల కోసం మట్టి విక్రయిస్తే ప్రభుత్వానికి రాయల్టీ, సీజ్‌నియరేజ్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ మంథనిలో మాత్రం ఎలాంటి అనుమతులు, ఫీజులు లేకుండానే కోట్ల రూపాయల విలువైన మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి

అధికారుల నిరక్ష్యంల్ల ఈ అక్రమ మట్టి దందా కారణంగా ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల ఆదాయ నష్టం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదని మండి పడుతున్నారు.

### క్షేత్రస్థాయి సర్వే జరిపి క్రిమినల్ కేసులు పెట్టాలి

జిల్లా కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించి అయ్యగారి చెరువు వద్ద క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అక్రమంగా తవ్విన మట్టి పరిమాణాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచే వసూలు చేయాలని కోరుతున్నారు. అలాగే చెరువులను నాశనం చేస్తున్న వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చెరువుల రక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ధర్మపురి వార్త



## ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తాం

రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్

ధర్మపురిప్రభాతవార్త



ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు ఆశా వర్కర్లు తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారితో మంత్రి మాట్లాడుతూ తమ సమస్యల్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

## గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి

చందుర్తి / ప్రభాతవార్త



గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్ అన్నారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో గురువారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మంజూరు చేసిన నిధులతో గ్రామంలో ని కూర్మ ఆరాధ్య దైవం బీరప్ప ఆలయంకు, రజక సోదరుల ఆరాధ్య దైవం మడేలస్వర స్వామి వారి ఆలయాలకు బోర్ మోటర్ మంజూరు చేయగా భూమి పూజ చేశారు,. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు మొకేలే విజేందర్, కురుమ, రజక సంఘం నాయకులతో పాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి

ఎడ్యుకేషన్ కేయూ, మే 28 ప్రభాతవార్త :

నవయుగ వైతాళికుడు, ప్రముఖ చరిత్రకారుడు, జర్నలిస్టు, తెలంగాణ సాహిత్యాభివృద్ధికి విశిష్ట సేవలందించిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలుగుభాష, తెలంగాణ చరిత్ర, సాహిత్యరంగాలకు చేసిన విశిష్టసేవలను అధ్యాపకులు స్మరించుకున్నారు. తెలుగుశాఖ అధ్యక్షులు డా.మామిడి లింగయ్య మాట్లాడుతూ, సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ సాహిత్య చరిత్రకు చిరస్మరణీయమైన సేవలు అందించారని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, భాషావైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడిగా ఆయన నిలిచిపోయారని తెలిపారు. పాలకమండలి సభ్యులు తెలుగుశాఖ పాఠ్యప్రణాళిక సంఘం అధ్యక్షులు డా.చిర్రరాజు మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి రచనలు నేటితరానికి మార్గదర్శకాలన్నారు. ఆయన ఆలోచనలు సమాజ చైతన్యానికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

# మగవా..ఓ మగవా..



- స్వశక్తి చాటుకున్న మహిళలు..
- మహిళలే హమాలీలుగా సేవలు...

ప్రభాతవార్త కోనరావుపేట:



కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం పోసి.తూకాలకు రోజుల తర బడి ఎదురుచూస్తున్నారు. స్థానికంగాహమాలీల కొరత.. బిహార్ కూలీలు కూడా లేకపోవడంతో ఇబ్బందికర పరి స్థితి ఏర్పడింది.దీంతో పురుషులకు దీటుగా మేమూ.పనిచేస్తామని అతివలు ముందుకొచ్చారు వారేస్వయంగా తూకం వేసి.ధాన్యం బస్తాలు ట్రాక్టర్లలో లోడ్ చేసి. కోనరావుపేట మార్కెట్ గోదాంలో దిగు మతి చేస్తున్నారు. కొనుగోళ్లు చకచకా పూర్తి చేస్తూ ఆదర్శంగా నిలిచారు

### -స్వశక్తి మహిళలే హమాలీలు

గోవిందరావుపేట పంచాయతీ పరిధిలో లచ్చపేట తండా, దోనా బంద తండా, సర్పంచి తండా, లొవుద్యా తండాలు ఉన్నాయి. గ్రామ పరిధిలో 11 స్వశక్తి మహిళా సంఘాలు పనిచేస్తున్నాయి. గ్రామాల్లో ధాన్యం తూకాలు వేయటానికి బిహార్ హమాలీల కొరత నెలకొనగా స్వశక్తి మహిళలే ముందుకొచ్చారు. 810 సభ్యులతో నాలుగు గ్రూపులుగా ఏర్పడ్డారు. తామే స్వయంగా ధాన్యం బస్తాలు నింపుతూ తూకం వేస్తున్నారు. అనంతరం రైతుల ట్రాక్టర్ల సాయంతో మిల్లులకు, మార్కెట్ గోదాంకు తరలిస్తున్నారు. అక్కడ అన్లోడింగ్ కూడా చేస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో తూకాలుముగియనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. నాలుగు అనుబంధ గ్రామాల్లో 99 మంది రైతులకు సంబంధించి 7,000 క్వింటాళ్ల ధాన్యం తూకం వేశారు. వీటిలో 6,500 క్వింటాళ్ల ధాన్యం గోదాం, మిల్లులకు తరలిం చారు. సుమారు 500 క్వింటాళ్ల మేర నిల్వలు ఉండగా తూకాలు తుది దశకు చేరు కున్నాయి. ఇతర గ్రామాల్లో ధాన్యం తూకం వేయటానికి క్వింటాలుకు రూ.60 వరకు హమాలీ కూలీ చెల్లిస్తుండగా, స్వశక్తి మహిళలు రూ.50 తీసుకుంటున్నారురైతులకు మేలు చేయడానికే..

### -హమాలీలు స్వశక్తి మహిళలమే ..

ధాన్యం తూకాలకు బిహార్ హమాలీలు, లారీల కొరత నెలకొంది. రైతుల ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసేలా, తూకాలు వేగ వంతం చేయడానికిమేంముందుకొచ్చాం.కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. హమాలీ డబ్బులు పొంద నుండడంతో ఆర్థిక అవసరాలకు ఉపయోగపడుతాయి. ఐకేపీ, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం బాగుంది గోవిందరావుపేట పంచాయతీ పరిధిలో లచ్చపేట తండా, దోనా బంద తండా, సర్పంచా తండా, లొవుద్యా తండాలు ఉన్నాయి. రైతుల ట్రాక్టర్ల సాయంతో మిల్లులకు, మార్కెట్ గోదాంకు తరలిస్తున్నాం అక్కడ అన్లోడింగ్ కూడా చేస్తున్నాం..

### -రైతులకు ఇబ్బంది కలగకుండా తూకాలు..



గ్రామ స్వశక్తి అధ్యక్షురాలు సుజాత.

రైతులకు ఇబ్బంది కలగకుండా హమాలీల కొరతతో మా స్వశక్తి మహిళలేహమాలీలుగా ఏర్పడి ధాన్యం తూకం వేశారని మహిళలు ముందుకు వచ్చి తూకం వేయకపోతే మా ధాన్యం కొనుగోలు చాలాఇబ్బందిగా ఉండేదని మా స్వశక్తి మహిళల తోనే మా కొనుగోలు కేంద్రం రెండు రోజుల్లో పూర్తయి అవుతుందని అన్నారు

## హుజురాబాద్ డివిజన్‌లో... భక్తిశ్రద్ధలతో.. ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట, హుజురాబాద్, కమలాపూర్, ఇల్లందకుంట, వీణవంక మండలాల పరిధిలో శనివారం ముస్లిం సోదరులకు అత్యంత పరమ పవిత్రమైన (ఈదుల్- అజ్హా) బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో, పట్టణాలలో ఉన్న ఈద్గాల వద్ద మత గురువుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి సమాధులపై పుష్పాలను సమర్పించారు. అనంతరం పలు మండల కేంద్రాలలో మత గురువులు అల్లాహ్ మానవ జీవిత రహస్యం.. క్రమపడి జీవించడంపై ముస్లిం సోదరులకు ప్రవక్త బోధనలను మత గురువులు వివరించారు. ఒకనాడు ఇబ్రహీం తన కలలో అల్లాహ్ తన కుమారుడిని బలిదానం కోరుకుంటున్నారని గ్రహించిన ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలిదానం (ఖుర్బానీ) ఇచ్చేందుకు సిద్ధపడుతారు. తండ్రి అంతరంగాన్ని గమనించిన కుమారుడు అల్లాహ్‌మార్గంలో బలయ్యేందుకు సిద్ధపడుతారు. బలి ఇచ్చే సమయంలో పుత్రవాత్సల్యం అడ్డువస్తే.. తనకు బలి ఇవ్వకుండా తన తండ్రి వెనుకడుగు వేస్తే.. అల్లాహ్‌తో విశ్వాసఘాతకుడిగా నిలవకుండా కళ్లకు గంతలతో తనను బలి ఇవ్వమంటూ తండ్రికి సూచిస్తాడని, ఈ మేరకు అల్లాహ్ నామస్మరణతో తన కుమారుడిని బలి ఇచ్చేందుకు గొంతుపై కత్తిపెట్టిన క్షణంలో త్యాగస్ఫూర్తికి మెచ్చి అల్లాహ్ ఆఖరు క్షణంలో ఇస్మాయిల్‌ను తప్పించి అదే స్థానంలో ఒక దుంబా (పొట్టేలు)ను ప్రత్యక్ష పరుస్తారని, దీంతో పొట్టేలు గొంతు తెగి అల్లాహ్ మార్గంలో అది ఖుర్బానీ అవుతుందని వక్తలు సూక్ష్మంగా వివరించారు. ఈ బక్రీద్ పండుగ మూడు రోజులు జరుపుకుంటారని ఈ నెలలోనే హజ్ తీర్థయాత్ర నిర్వహిస్తారని వారు తెలిపారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి వెళ్లి మస్జిద్ అల్-హరమ్ లోని కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేస్తారని మతగురువులు వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు పేదలకు పలు రకాల దానాలను చేయడంతో పాటు మేకలను, గొర్రెలను (ఖుర్బానీ) జిబాత్ చేసి మాంసాన్ని పంపిణీ చేసారు. వారి ఇండ్లలో ప్రత్యేక వంటకాలు చేసి ప్రత్యేకంగా సేమియాను తయారుచేసి చుట్టుపక్కల వారికి, పరిచయస్తులకు పంపిణీ చేసారు. మస్జీద్‌లలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఐదు సార్లు ప్రత్యేకంగా ప్రార్థనలు చేసారు. నియోజకవర్గంలోని పవిత్ర బిజిగిరిషరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లిం సోదరులకు జమ్మికుంట ఆయా మండల కేంద్రాలలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపల్ కమీషనర్లు గుట్టల మల్లిఖార్జున స్వామి, బి కిషన్, మున్సిపల్ చైర్మన్లు మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్), రొంటాల సుహాసిని, మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, పులువురు రాజకీయ నేతలు ఒకరికొకరు ఈద్ ముబారక్ (బక్రీద్) శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ సమియుల్లాఖాన్, హుస్సేన్, ముస్లిం మత గురువులు అఫ్జల్ ఖాద్రి, నజీర్ ఖురేషి, సఫియార్ రహమాన్, సుఫియాన్‌లతో పాటు పలువురు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

### -జిల్లా ఎస్.పి మహేష్ బి గితే

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పేర్కొన్నారు. మండలములోని కందికట్కూర్ లో గల శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లిని గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎల్లమ్మ తల్లి ఆశీసులు పొందారు.జాతర నిర్వాహకులు జిల్లా ఎస్పీ ని శాలువాతో సత్కరించారు.జాతర సందర్భంగా అమ్మ వారి చెంతకు విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ కంది కట్కూర్ రేణుకా



ఎల్లమ్మకు ప్రత్యేకత ఉంద న్నారు. మండల ప్రజలే కాకుండా ఇతర జిల్లాల, రాష్ట్రాల నుండి భక్తులు విచ్చేసి రెండు రోజుల జాత రలో మొక్కులు చెల్లించు కోవడం జరుగుతుంద న్నారు. జాతరలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా భక్తులు ఉత్సవములో పాల్గొనాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి,ప్రభాతవార్త:





ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ధర్మపురి పట్టణంలోని ఈద్గా వద్ద స్థానిక ముస్లిలు నిర్వహించిన ప్రార్థనల్లో మంత్రి పాల్గొని,వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలోని మజీదులు, ఈద్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.7 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుపేద యువతీ,యువకులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్ పర్సన్, వేముల నాగలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు, వేముల రాజేష్,మున్సిపల్ కౌన్సిలర్ సంగి ఆనంద్,ముస్లిం మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం

- -రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు
- -కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని కలెక్టర్ చిత్రా మిశ్రా,గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, రైతులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దని కలెక్టర్ సూచించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు స్వీకరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అకాల వర్షాల కారణంగా జిల్లాలో తడిసిన సుమారు 600 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసి మండలాల వారీగా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. కరీంనగర్ మండలంలోని పాక్స్ కరీంనగర్ కేంద్రంలో 600 క్వింటాళ్లు, గంగాధర మండలంలోని పాక్స్ గంగాధరలో 1200 క్వింటాళ్లు, లక్ష్మీదేవిపల్లిలో 400 క్వింటాళ్లు, చెర్లపల్లి (ఎన్)లో 400 క్వింటాళ్లు, ర్యాలపల్లిలో 320 క్వింటాళ్లు, కొండయ్యపల్లిలో 200 క్వింటాళ్లు, వెంకటాయిపల్లిలో 160 క్వింటాళ్లు, మంగపేటలో 120 క్వింటాళ్లు, మధురానగర్‌లో 40 క్వింటాళ్లు, నర్సింహులపల్లిలో 240 క్వింటాళ్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు.అదేవిధంగా చొప్పదండి మండలంలోని పాక్స్ చొప్పదండి కేంద్రంలో 800 క్వింటాళ్లు, రామడుగు మండలంలోని తిర్మలాపూర్‌లో 1230 క్వింటాళ్లు, గన్నేరువరం మండలంలో 290 క్వింటాళ్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో రెండు లక్షల 67 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు రూ.488.52 కోట్లను ఇప్పటికే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. అదేవిధంగా జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం వేగవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్లను మరింత వేగవంతం చేశామని, కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. ధాన్యం, మొక్కజొన్న నిల్వ, రవాణా, హమాలీ, ఆన్‌లైన్ నమోదు అంశాల్లో ఎటువంటి ఆటంకాలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

